


తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 41 | 12.10.2026 నుంచి 18.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |




## బీసీ రిజర్వేషన్లకు బ్రేక్..

- రిజర్వేషన్ల పెంపునకు నో..
- సుప్రీంకోర్టు తీర్పుతో కూటమి సర్కారుకు కొత్త సవాల్..
- ప్లాన్-బీ అమలుకు సిద్ధమా?
- ఆరు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్‌కు ఈసీ సంసిద్ధత

# స్థానిక ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్!

సత్తెనపల్లి న్యూస్ : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. అదే సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక ఎన్నికలకు ముందు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా పునఃపరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తిచేయాలన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థనకు సానుకూల స్పందన లభించకపోగా.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై దాఖలైన పిటిషన్‌ను కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణ, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

### ఆరు వారాల్లో నోటిఫికేషన్‌కు సిద్ధం!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏపీ హైకోర్టు నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నట్లు సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆరు వారాల్లోపు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలను వాయిదా వేయాలన్న వైఎస్సార్‌సీపీ వాదనకు కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు రాలేదు. దీంతో ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగే దిశగా పరిణామాలు చోటుచేసుకున్నాయి.



### బీసీ రిజర్వేషన్ల పెంపునకు న్యాయపరమైన అడ్డంకి

స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి న్యాయపరమైన అడ్డంకులు కొనసాగుతున్నాయి. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న పరిమితిని ప్రస్తావిస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ప్రభుత్వ వాదనలకు ధర్మాసనం ఆమోదం తెలపలేదు. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం.. బీసీ రిజర్వేషన్లను నిర్ణయించేందుకు ప్రభుత్వం ఆధారంగా చూపిన గణాంకాల చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తింది. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఏ చట్టం కింద నిర్వహించారో వివరించాలని కోరింది. రిజర్వేషన్ల పెంపునకు ఆ సర్వే గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవడానికి ఉన్న చట్టబద్ధమైన ఆధారాలను ప్రభుత్వం నిరూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఆధారపడిన కమిషన్ నివేదిక ఇంకా ఆమోదం పొందలేదన్న అంశాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో 34 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై ఆసక్తి నెలకొంది.

### 50 శాతం పరిమితే ప్రధాన అడ్డంకి!

రిజర్వేషన్ల అంశంలో 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఇందిరా సాహ్నీ తీర్పు కీలకంగా ఉంది. సాధారణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించకూడదనే సూత్రాన్ని ఆ తీర్పు నిర్దేశించింది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహాయింపులపై న్యాయపరమైన చర్చకు అవకాశం ఉన్నప్పటికీ, వాటిని సమర్థించే ఆధారాలు అవసరం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ, చట్టపరమైన నిబంధనలతోపాటు అవసరమైన గణాంకాల ప్రామాణికతను నిరూపించాల్సి ఉంటుంది. కేవలం జనాభా అంచనాలు లేదా సర్వే వివరాల ఆధారంగా రిజర్వేషన్లను పెంచడం సాధ్యం కాదన్నది తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

### కూటమి ప్లాన్-బీ ఏమిటి?

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రాజకీయంగా మరో మార్గాన్ని ఎంచుకునే అవకాశంపై చర్చ సాగుతోంది. చట్టబద్ధమైన రిజర్వేషన్ల శాతాన్ని పెంచడం సాధ్యం కాని పరిస్థితుల్లో.. పార్టీ పరంగా బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న ప్రతిపాదన తెరపైకి వస్తోంది. రిజర్వేషన్ల రూపంలో కాకుండా పార్టీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కూటమి నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ పరంగా సీట్ల కేటాయింపు, చట్టబద్ధమైన రిజర్వేషన్లు రెండూ వేర్వేరు అంశాలు. పార్టీ నిర్ణయం వల్ల స్థానిక సంస్థల్లో చట్టబద్ధంగా అమలయ్యే రిజర్వేషన్ల శాతం మారదు.

### ఎన్నికలే లక్ష్యమా.. బీసీ ప్రాతినిధ్యమే సవాలా?

ఒకవైపు ఎన్నికల సంఘం ఆరు వారాల్లో నోటిఫికేషన్ విడుదలకు సిద్ధమని ప్రకటించడం.. మరోవైపు బీసీ రిజర్వేషన్ల పెంపునకు సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేయడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది. ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంతోపాటు బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న హామీని ఎలా అమలు చేస్తారన్నది ఇప్పుడు కూటమి ప్రభుత్వ ముందున్న ప్రశ్న. పార్టీ పరంగా 34 శాతం సీట్ల కేటాయింపు దిశగా అడుగులు వేస్తుందా? లేక రిజర్వేషన్ల అంశంలో చట్టపరమైన ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తుందా? రానున్న రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాలే దీనికి సమాధానం చెప్పనున్నాయి.

## మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు



**అమరావతి:** శాంతిభద్రతల సమస్యలతో పాటు ఎన్నికల ఏర్పాట్లలో సమస్యలు తలెత్తకుండా ఉండేం దుకు అన్ని మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్లకు ఒకేరోజు పోలింగ్ కాకుండా రెండు దశల్లో నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సూచించారు. అదే మాదిరిగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా రెండు దశల్లో నిర్వహిం చాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు జరుగు తున్న ఏర్పాట్లతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో పాటు జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, నగర మున్సిపల్ కమిష నర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్ కూడా పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తయినట్లు చెప్పిన కలెక్టర్లు, ఎస్పీలు.. ఒక్క దశలోనే ఎన్ని కలు నిర్వహిస్తే వచ్చే ఇబ్బందులను వివరించారు.

## దసరా ఉత్సవాల తొలి 3 రోజులకు వీఐపీ టికెట్లు విడుదల



**ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ):** దసరా ఉత్సవాల్లో తొలి మూడు రోజులకు వీఐపీ టికెట్లను ఆలయ ఈవో శీనానాయక్ శు క్రవారం విడుదల చేశారు. రూ.వెయ్యిపై వీఐపీలకు బంగారు వాకిలి దర్శనం కల్పించనున్నారు. మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఈవో శీనానాయక్, ఈఈ ఎల్.రమా, ఆలయ టెక్నికల్ సిబ్బంది హరీష్ ఈ టికెట్లను విడుదల చేశారు. దసరా ఉత్సవాల్లో ఎటువంటి సిఫార్సులు లేకుండా భక్తులు జగన్మాత దివ్య దర్శనానికి సంబంధించి 11, 12, 13వ తేదీలకు రూ.1,000 టికెట్లను జారీ చేశామని, ఈ టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు వీఐపీ క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనం చేసుకోవచ్చునన్నారు.

మన మిత్ర యాప్ ద్వారా భక్తులు ఈ టికెట్లను పొందవచ్చునని తెలిపారు. మూలా నక్షత్రం మినహా అన్ని రోజులకు విడతల వారీగా టికెట్లు విడుదల చేస్తామన్నారు. టికెట్లు పొందిన భక్తులు కుమ్మరి పాలెంలోని టీటీడీ స్థలం నుంచి దేవస్థానం ఏర్పాటు చేసిన బస్సుల ద్వారా కొండపైకి చేరుకుంటారని, దర్శనం అనంతరం మల్లికార్జున స్వామి వారి ఆలయం మీదగా కొండ దిగువనకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, ఆలయ సిబ్బందికి ప్రత్యేక డ్యూటీ పాస్‌లను జారీ చేశారు.



## ఏపీ ఎన్నికలపై అనుమానాలెందుకు?

- ఏపీనే ఎందుకు ఉదాహరణ..
- పోలింగ్ సమయాలపై ప్రశ్నలు.. పెరిగిన ఓట్లపై సందేహాలు
- ఈసీ లెక్కలే ప్రశ్నల వేదికగా మారాయా?
- ఏపీ ఎన్నికలపై పరిశోధన చేస్తున్నానన్న ప్రకాశ్‌రాజ్
- మూడు సెకన్లకు ఒక ఓటు ఎలా? అంటున్న పరాకాల ప్రభాకర్

**అమరావతి:** దేశంలో ఎన్నికల నిర్వహణపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ఎన్నికల సంఘం తీరుపై ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు, పౌర సమాజానికి చెందిన పలువురు వ్యక్తులు అనేక ప్రశ్నలు సంధిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల గణాంకాలు ఇప్పుడు చర్చకు కేంద్రంగా మారాయి. ప్రత్యేకంగా పోలింగ్ ముగిసిన తర్వాత కూడా పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఓట్లు నమోదైనట్లు వెల్లడైన వివరాలపై వివరణ ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. పోలింగ్ సమయానికి సంబంధించిన గణాంకాలు, అనంతరం నమోదైన ఓట్ల సంఖ్యపై స్పష్టత అవసరమని విమర్శకులు అంటున్నారు.



# ఓటు పడిందా..? లెక్క మారిందా..?

### ఏపీలోనే ఎందుకీ ప్రశ్నలు?

2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సాధారణ సమయం దాటిన తర్వాత కూడా పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగింది. కొన్ని వేల పోలింగ్ కేంద్రాల్లో రాత్రి ఆలస్యంగా పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సంఘం గణాంకాలు సూచిస్తున్నాయని ఎన్నికల ప్రక్రియపై విమర్శలు చేస్తున్నవారు గుర్తు చేస్తున్నారు. ఇదే అంశాన్ని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరాకాల ప్రభాకర్ పదేపదే ప్రస్తావిస్తున్నారు. మూడు సెకన్లకు ఒక ఓటు చొప్పున నమోదైనట్లుగా కనిపించే కొన్ని గణాంకాలపై ఆయన ప్రశ్నలు సంధిస్తున్నారు. తెల్లవారుజామున వరకు కొనసాగిన పోలింగ్‌లో తక్కువ వ్యవధిలో భారీ సంఖ్యలో ఓట్లు ఎలా నమోదయ్యాయన్నదే ఆయన ప్రధాన ప్రశ్న. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత నమోదైన ఓట్ల సంఖ్యపై కూడా ఆయన అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ గణాంకాలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇస్తేనే ప్రజల్లో ఉన్న సందేహాలకు తెరపడుతుందని ఆయన అభిప్రాయపడుతున్నారు.

### ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలతో మళ్లీ చర్చ

ఇదే సమయంలో ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై తనకు అనుమానాలు ఉన్నాయని తాజాగా పేర్కొనడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏపీ ఎన్నికలపై తాను పరిశోధన చేస్తున్నానని, త్వరలో మరిన్ని వివరాలతో మాట్లాడతానని ఆయన చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియపై ఉన్న రాజకీయ చర్చకు మరో కోణం చేరింది.

### 11 సీట్ల ఫలితం.. అప్పుడే మొదలైన సందేహాలు

2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. ఘోర పరాజయం అనంతరం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఫలితాలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల్లో ఏదో జరిగిందనే అనుమానం ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద లేవని ఆయన పేర్కొన్న సందర్భం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలు ఈవీఎంలపై అనేక ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటి వరకు నిర్ధారిత ఆధారాలు ప్రజల ముందుకు రాలేదు. దీంతో అసలు ప్రశ్న మాత్రం అలాగే మిగిలింది... ఎన్నికల గణాంకాల్లో కనిపిస్తున్న వ్యత్యాసాలకు పూర్తి వివరణ ఏమిటన్నదే.

### ఎన్నికల సంఘం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలేనా?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉండే నమ్మకమే అత్యంత కీలకం. అందుకే ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి అనుమానాలు వ్యక్తమైనా వాటిని రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కంటే.. గణాంకాలతో, అధికారిక వివరాలతో సమాధానం ఇవ్వడం అవసరం. పోలింగ్ ముగిసిన తర్వాత నమోదైన ఓట్ల సంఖ్య, ఆలస్యంగా కొనసాగిన పోలింగ్, వివిధ దశల్లో వెల్లడైన గణాంకాల మధ్య తేడాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని విమర్శకులు కోరుతున్నారు. ఇదే సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై కూడా ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. అయితే ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా ఓట్లను మార్చిందని లేదా ఏదైనా పార్టీకి అనుకూలంగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసిందని చెప్పడానికి నిర్ధారిత ఆధారాలు అవసరం.

### అనుమానాలకు సమాధానం.. ప్రజాస్వామ్యానికి బలం

గతంలో ఓటర్లు ఎవరిని అధికారంలోకి తీసుకురావాలో నిర్ణయించేవారు. ఇప్పుడు ఓటర్ల జాబితా, పోలింగ్ గణాంకాలు, ఓట్ల లెక్కింపు వంటి అంశాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటే అది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన పరిణామం కాదు. అందుకే ఎన్నికల సంఘం చేయాల్సింది విమర్శలను ఎదుర్కోవడం కాదు.. ప్రతి అనుమానానికి ఆధారాలతో సమాధానం ఇవ్వడం. ఏపీ ఎన్నికల గణాంకాలపై ప్రశ్నలు ఉంటే వాటికి పూర్తి వివరాలు ప్రజల ముందుంచాలి. అదే సమయంలో ఆరోపణలు చేస్తున్నవారు కూడా తమ వాదనలకు ఆధారాలను సమర్పించాలి. ఎన్నికలపై ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి పునాది. ఆ విశ్వాసంపై చిన్న సందేహం వచ్చినా.. దానికి పారదర్శకమైన సమాధానమే పరిష్కారం. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయా? లేక గణాంకాలను తప్పుగా అర్థం చేసుకోవడమేనా? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం రావాల్సిందే. అదే ప్రజాస్వామ్యానికి అసలైన విజయం.

## స్థానిక ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించాలి

- ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలంటే ఇది అవసరం
- భద్రతా బాధ్యతలను రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే న్యాయం జరగదు
- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ లేఖలు



**సత్తెనపల్లి ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కేంద్ర బలగాలను మోహరించాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ అభ్యర్థులకు తగినంత భద్రత కల్పించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు భయం, బెదిరింపులు లేకుండా తమ నామినేషన్ పత్రాలను జిల్లా కేంద్రాల్లో సమర్పించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాటు్లు చేయాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, రసీదుల జారీ, సంబంధిత అధికారులకు పత్రాల బదిలీ ప్రక్రియలో స్పష్టమైన విధానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు శుక్రవారం వేర్వేరుగా లేఖులు రాశారు.

**ప్రతిపక్ష నాయకులు కార్యకర్తలపై రాజకీయ బెదిరింపులు, దాడులు**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించాలి. కేంద్ర బలగాల మోహరింపు ఎన్నికల సంఘం సమర్థవంతమైన పర్యవేక్షణలో జరగాలి. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రాజకీయ బెదిరింపులు, దాడులు జరుగుతున్నాయి. ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల భద్రత బాధ్యతలను పూర్తిగా రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే నిష్పక్షపాత వాతావరణం ఉంటుందన్న విశ్వాసం మాకు లేదు. ఓటర్లును బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, అధికార యంత్రాంగాన్ని లేదా ప్రభుత్వ వనరులను దుర్వినియొుగం చేయడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలి.

**నామినేషన్లనూ అడ్డుకునే అవకాశం :** కూటమి పాలనలో ప్రతిపక్ష అభ్యర్థులు బెదిరింపులు, దాడులు, రాజకీయ ప్రేరేపిత పోలీసు చర్యలు ఎదుర్కొంటుున్నారు. ఎన్నికల సమయంలో ఇవి మరింత తీవ్రమై, ప్రతిుపక్ష అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేుయడం, ప్రచారాన్ని నిరోధించడం వంటి పరిణామాలకు దారితీయవచ్చు. పోలింగ్ రోజు మాత్రమే భద్రత కల్పియిచడం సరిపోదు. నామినేషన్ల ప్రారంభానికి ముందే కేంద్ర బలగాలను మోహరించి, ఫలితాలు ప్రకటించే వరకు కొనసాగించాలి. ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యుర్థులకు వివక్ష లేకుండా అనుమతు లు ఇువ్వాలి.ప్రతిపక్ష అభ్యర్థులు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు తమ చట్టబద్ధమైన ఎన్నికల బాధ్యత లను నిర్వహించకుండా అడ్డుకోవడానికి పోలీసు అధికారాలను ఉపయోగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి.

## మూడేళ్లలో మెదటిసారి వడ్డీ రేట్లను పెంచిన ఆర్‌బీఐ

**ఢిల్లీ :** ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో భారత రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత బెంచ్‌మార్క్ వడ్డీ రేటైన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం అధికారికంగా ప్రకటించారు. దాంతో రెపోరేటు 5.25 నుంచి 5.5కు చేరింది. ఈ నిర్ణయంతో కీలక రేట్లు పెరిగి, గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై ఈఎంఐల భారం మరింత పడ నుంది. ముంబైలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో ముగిసిన మూడ్రోజుల ఎంపీసీ ద్వైమాసిక సమావేశ నిర్ణయాలను గవర్నర్ ఉదయం వెల్లడించారు. ఫిబ్రవరి 2023 తర్వాత ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచడం మళ్లీ ఇదే తొలిసారి. తాజా పెంపుతో బ్యాంకింగ్ వ్యవస్థలో వడ్డీ రేట్ల సరళి మారనుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్‌బీఐకి ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యతల్లో ధరల స్థిరత్వాన్ని కాపాడటం ఒకటి. నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు, ఇంధన ధరలు పెరిగినప్పుడు ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులకు లోనవుతుంది.

## ఆలోచనశక్తికి ఏఐ వైరస్

**అమరావతి:** సైన్స్ ప్రాజెక్టా? కృత్రిమ మేధ సిద్ధంగా ఉంది. వ్యాసం రాయాలా? ఏఐ సెకన్లలో రాసిచ్చేస్తుంది. కోడింగ్ ఎర్రరా? టూల్ సరిచేస్తుంది. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానం విద్యారంగాన్ని పరుగులు పెట్టించడం నిజమే అయినా.. దానికి సమాంతరంగా విద్యార్థుల స్వతంత్ర ఆలోచనశక్తికి గండికొడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చేతికి వచ్చిన సరికొత్త 'కాగ్నిటివ్ ఆఫ్--లోడింగ్' (మెదడు చేయాల్సిన ఆలోచనను మెషీన్‌కు అప్పగించే ధోరణి) యువతరాన్ని ఆలోచనశక్తి హీనులుగా మార్చేస్తోందంటున్నారు. ఇది భవిష్యత్ తరాలను వేగంగా ప్రమాదంలోకి నెడుతోందని ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న అధ్యయనాలు, సర్వేలు హెచ్చరిస్తున్నాయి.

అంతర్జాతీయ విద్యాసంస్థలు, డిజిటల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డీఈసీ--సింగపూర్), చీగ్ గ్లోబల్ (యూఎస్ఏ) నివేదికల ప్రకారం ఉన్నతవిద్య విద్యార్థుల్లో జనరేటివ్ ఏఐ సాధనాల వినియోగం శరవేగంగా పెరిగింది. మనదేశంలోను ఇంజినీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 50 శాతం మంది విఫలమవడానికి కారణం ఏఐపై అధికంగా ఆధారపడడమేనని చెబుతున్నారు. మెదడును శ్రమపెట్టే విద్యార్థే భవిష్యత్తులో సాంకేతికతను నడిపిస్తాడని, లేదంటే సాంకేతికతే ఆ విద్యార్థిని నడిపిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొత్తగా అరచేతిలోకి వచ్చిన కృత్రిమ మేధ మనుషుల మేధస్సును తుస్సుమనిపిస్తోంది. ముఖ్యంగా విద్యార్థుల్లో తమ మెదడుకు పనిచెప్పకుండా, ఆలోచనకు పదును పెట్టకుండా సులభంగా పనిపూర్తయ్యే మార్గాల కోసం ఏఐని ఆశ్రయించేవారి సంఖ్య పెరుగుతున్నట్టు డీఈసీ సర్వేలో వెల్లడైంది. హోంవర్క్ చేసేందుకు, ప్రాజెక్టుల కోసం, అసైన్‌మెంట్లు, అనువాదాలు, పరీక్షల సన్నద్ధత, అకడమిక్ పేపర్ల ఎనాలసిస్.. ఇలా ఒకటేంటి అన్నింటికీ జనరేటివ్ ఏఐ సాధనాలపై ఆధారపడుతున్నట్టు గుర్తించారు.

ఈ విధానం ఎక్కువగా, యూకే, లాటిన్ అమెరికా, భారత్, యూఎస్ఏ, యూరప్ దేశాల్లో వేగంగా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరుసలో యునైటెడ్ కింగ్‌డమ్ 92--95 శాతంతో మొదటిస్థానంలో ఉండగా మనదేశం 86-89 శాతంతో మూడోస్థానంలో ఉంది. యూకేలో అసైన్‌మెంట్లు, రీసెర్చ్ సారాంశాలు, కాన్సెప్ట్ క్లారిటీ కోసం, బ్రెజిల్, మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాల్లో ప్రాజెక్టులు, అనువాదాలు, హోంవర్క్ కోసం ఏఐని వాడుతుండగా, భారతదేశంలో కోడింగ్ సమస్యలు, పరీక్షల సన్నద్ధత, ప్రాజెక్టుల కోసం, అమెరికాలో వ్యాసాలు, బ్రెయిన్ స్టార్టింగ్, క్విజ్ ప్రిపరేషన్ కోసం, ఫ్రాన్స్, జర్మనీ వంటి యూరప్ దేశాల్లో థీసిస్ రీసెర్చ్, అకడమిక్ పేపర్ల తయారీకి వాడుతున్నారు.

శాతాల పరంగా బ్రిటన్ మొదటిస్థానంలో ఉన్నప్పటికీ.. సంఖ్యాపరంగా చూస్తే భారతదేశమే ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో నిలుస్తోంది. దేశంలో ఉన్న సుమారు 4.3 కోట్లమంది ఉన్నతవిద్య విద్యార్థుల్లో ఏకంగా 3.5 కోట్ల మందికిపైగా రోజూ లేదా వారానికి పలుమార్లు ఏఐని వాడుతున్నట్టు తేలింది. యూఎస్‌లో ఈ సంఖ్య 1.4 కోట్లు ఉండగా, యూకేలో సుమారు 20 లక్షల వద్ద ఉంది.

జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విద్యార్థుల్లో స్వంతంగా శోధించి నేర్చుకునే సంస్కృతి తగ్గిపోతోందని సర్వేలు చెబుతున్నాయి. ఇది మానవ మేధస్సును నాశనం చేస్తున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. విషయ పరిజ్ఞానం పెంచుకోకుండా కాపీ--పేస్ట్ సంస్కృతి విస్తరిస్తోందంటున్నారు. ప్యూ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం ప్రతి పదిమంది విద్యార్థుల్లో ఆరుగురు (60 శాతం) ఏఐ ఇచ్చిన ఫలితాలను క్రాస్‌చెక్ చేయకుండా నేరుగా సబ్మిట్ చేస్తున్నారు. విద్యార్థులు స్వయంగా గ్రంథాలయాలు, పుస్తకాల్లో చదివి పరిశోధన చేసే సమయం గతంతో పోలిస్తే సుమారు 45 శాతం తగ్గింది.

కాగ్నిటివ్ ఇంపాక్ట్ స్టడీస్ ప్రకారం.. నిరంతరం ఏఐ టూల్స్‌పై ఆధారపడే విద్యార్థుల్లో సమస్య పరిష్కార సామర్థ్యం, సమాచారాన్ని నిలుపుకొనే జ్ఞాపకశక్తి సాధారణ విద్యార్థుల కంటే 20-25% తగ్గుముఖం పడుతోంది.

కార్పొరేట్ హెచ్‌ఆర్ సర్వేల ప్రకారం, దేశవ్యాప్తంగా క్యాంపస్ డ్రైవ్‌లలో పాల్గొనే భారతీయ ఐటీ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో 40--50 శాతం మంది ముఖాముఖి ఇంటర్వ్యూలలో ప్రాథమిక లాజిక్, మాన్యువల్ కోడింగ్ రాయడంలో విఫలమవుతున్నారు. కాలేజీల్లో ఆటోమేటెడ్ కోడ్ జెనరేషన్ టూల్స్ వాడటం వల్ల, మొదటి నుంచి సొంతంగా లాజిక్ నిర్మించే ఆలోచన విద్యార్థుల్లో లోపిస్తోందని, దీంతో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఇంటర్వ్యూలలో తేలిపోతున్నారని చెబుతున్నారు.

ఏఐ టూల్స్ కొన్నిసార్లు ఉనికిలో లేని తప్పుడు సమాచారాన్ని (ఏఐ హాలూసినేషన్) కూడా సరైనదేనన్నట్లు భ్రమింపజేస్తాయని, సర్వేల ప్రకారం 55 శాతం మంది విద్యార్థులు ఆ ఆధారాలను ధ్రువీకరించుకోకుండానే తమ ప్రాజెక్టుల్లో జోడిస్తున్నారని గుర్తించారు.

యూకే, యూఎస్ వంటి దేశాల్లో ఏఐ అకాడమిక్ ఎథిక్స్, డిటెక్షన్ సాఫ్ట్‌వేర్ల వినియోగం ఇప్పటికే మొదలైంది. భారత్‌లో సీబీఎస్ఈ, యూజీసీ వంటి విద్యామండళ్లు మార్గదర్శకాలపై కసరత్తు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తీవ్ర అంతరాలున్నాయి. విద్యార్థులకు ఇచ్చిన హోంవర్క్, అసైన్‌మెంట్లు నిమిషాల్లో పూర్తవుతుండటంతో అసలైన ప్రతిభను గుర్తించడం అధ్యాపకులకు పెద్ద సవాలుగా మారింది. దేశంలోని 80 శాతం విద్యాసంస్థల్లో సరైన ఏఐ--డిటెక్షన్ వ్యవస్థలు అందుబాటులో లేవు. పాశ్చాత్య దేశాల్లో విద్యార్థులు ఆలోచనలకు మెరుగులు దిద్దుకోవడానికి ఏఐని వాడితే, భారత్‌లో ఇంకా చాలామంది విద్యార్థులు శ్రమను తప్పించుకునే 'షార్ట్‌కట్'గా మాత్రమే చూస్తున్నారని చెబుతున్నారు. ఈ క్రమంలో కొన్ని పరిష్కారమార్గాలను అనుసరిస్తే విద్యార్థిని 'మాస్టర్'గా నిలబెట్టవచ్చని పేర్కొంటున్నారు.






# సేవా నిధి

- 'హెల్త్ ఫౌండేషన్': సమాజ హితమే ధ్యేయంగా
- కంచర్ల బుల్లిబాబు అక్షయ పాత్ర!

సత్తెనపల్లి (న్యూస్‌లైన్): సేవే పరమావధిగా సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సత్తెనపల్లి కేంద్రంగా ఆవిర్భవించిన 'హెల్త్ ఫౌండేషన్' నిరంతర ప్రజాసేవలో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు నేతృత్వంలో ఈ సంస్థ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, అక్షరాస్యత, మహిళా భద్రత వంటి నాలుగు ప్రధాన స్తంభాలపై నిలబడి సమాజంలో వెలుగులు నింపుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు, పాఠశాలల నుంచి పరిశ్రమల వరకు విస్తృత స్థాయిలో అవగాహన, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతో మంది జీవితాల్లో ఆశాకిరణంగా మారింది. ఆరోగ్య పరిరక్షణ నిరుపేదలకు ఉచిత వైద్యం:ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు హెల్త్ ఫౌండేషన్ నిరంతరం వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది.






### 'విద్యా ' నవతరం భవిష్యత్తుకు బాటలు:

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు 'విద్యా వికాసం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 5,000 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి (ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు మొదలైనవి పంపిణీ చేశారు. పరీక్షల భయం పోగొట్టేందుకు, వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు నిపుణులతో ప్రత్యేక ప్రేరణ తరగతులు నిర్వహించారు. అనాథ పిల్లలకు చలికాలంలో చలికోట్లు (స్వెట్టర్లు), వృద్ధాశ్రమాలలో నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

### మహిళా భద్రత చట్టాలపై అవగాహన:

మహిళలు, బాలికల రక్షణ కోసం హెల్త్ ఫౌండేషన్ నిరంతరం పోరాడుతోంది. మహిళలకు వారికున్న చట్టాలు, ప్రాథమిక హక్కులపై చైతన్య సదస్సులు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధానికి, పోక్సో చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఉద్యోగ మేళాలు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు ఉద్యోగ మేళాలు నిర్వహించారు.

### మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా:

యువత జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వాడకానికి వ్యతిరేకంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా వివిధ పట్టణాల్లో 250 మీటర్ల భారీ జాతీయ జెండాతో భారీ ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని రగిలించారు.




### అభినందనలు ప్రభుత్వ ప్రశంసలు:

హెల్త్ ఫౌండేషన్ చేస్తున్న నిర్విరామ సేవలను గుర్తించిన తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకకు చెందిన దాదాపు 100కు పైగా స్వచ్ఛంద సంస్థలు కలసి వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబును ఘనంగా సన్మానించాయి. 2023లోపల్నాడు జిల్లా అప్పటి కలెక్టర్ ఎల్. శివశంకర్ చేతుల మీదుగా 'ఉత్తమ స్వచ్ఛంద సంస్థ'గా ప్రశంసా పత్రం అందుకున్నారు. 2026లో శానిటేషన్, పర్యావరణ పరిరక్షణ, జ్యూట్ బ్యాగ్స్ పంపిణీ వంటి వినూత్న సేవలను గుర్తించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా హెల్త్ ఫౌండేషన్‌ను 'ఉత్తమ స్వచ్ఛంద సంస్థ'గా ఎంపిక చేసి, మెమొంటో, శాలువా, ప్రశంసా పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ సుదీర్ఘ సేవా ప్రయాణంలో తమకు నిరంతరం సహకరిస్తున్న దాతలు, స్నేహితులు, బంధువులు, అభిమానులు, ప్రభుత్వ అధికారులు, హెల్త్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

















వేలాది మంది పేదలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, వందలాది మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. చిన్నారుల కోసం ప్రత్యేక దంత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. క్యాన్సర్ అవగాహన గుండె వైద్యం: మహిళల్లో విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై గ్రామాలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. వృద్ధులకు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు ఉచిత గుండె వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పర్యావరణ సమతుల్యత కోసం హెల్త్ ఫౌండేషన్ చేసిన కృషి అభినందనీయం.

వివిధ హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తూ, విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు జ్యూట్ బ్యాగ్స్ పంపిణీ చేయడమే కాకుండా, వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్స్ పెంపకానికి ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. పంచాయతీలలో, డ్వాక్రా మహిళా సంఘాలకు తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రైతులకు నేల కాలుష్యంపై ప్రత్యేక చైతన్యం తెచ్చారు.






## విద్యావికాసం



"విద్యా దదాతి వినయం" (విద్య వినయాన్ని కలిగిస్తుంది) ." శీలేన శోభతే విద్య"( నడవడిక వలన విద్య శోభిస్తుంది) పాఠశాలల గోడల మీద పై వాక్యాలు వ్రాయబడి ఉంటాయి అంటే ఈ వాక్యాల వలన మనిషికి విద్యతో పాటు నైతిక విలువలు కలిగి ఉండేటే సమాజంలో గౌరవం, గుర్తింపు ఉంటుంది అనేది పై వాక్యాల భావన. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు నైతిక విలువల ప్రాధాన్యతను గూర్చి తెలియ చెప్పడానికి పాఠశాలలో నైతిక విలువలు తెలిపే పాఠాలతో పాటు ప్రభుత్వాలు ప్రత్యేకంగా మోటివేషన్ క్లాసులు, ( మెంటార్) అనుభవజ్ఞులచే ఉపన్యాసాలు, యోగ, క్రీడలు మొదలగునవి పాఠశాలల్లో సమయ పట్టిక నందు ఒక అంశముగా వీటిని చేర్చారు. వీటివలన విద్యార్థుల్లో మార్పు కొంతవరకు మాత్రమే వస్తుంది. ఎందుకంటే సమాజానికి మూలం కుటుంబ వ్యవస్థ కావున ఈ కుటుంబం నుండే పై నైతిక విలువలనుకు సంబంధించిన పునాది ఏర్పడుతుంది. కుటుంబ సభ్యుల ప్రవర్తన, వారి మాటలు పిల్లలపై ప్రభావం చూపుతుంది కుటుంబంలో పెద్దల ప్రవర్తనను పిల్లల గమనిస్తారు మరియు అనుకరిస్తారు చివరకి ఆచరిస్తారు. ఈ మధ్యకాలంలో స్నేహితులు, మీడియా ప్రభావం అధికంగా పిల్లలపై చూపుతుంది కుటుంబ పెద్దలు పై విషయాలను గమనించి మీడియాలో పిల్లవాడికి ప్రయోజనం చేకూర్చే అంశాలు, మంచి స్నేహితులు గూర్చి, నైతిక విలువలు పెంపొందటానికి కావలసినటువంటి విషయాల పట్ల చర్చించి నట్లయితే రాబోవు తరాలలో మంచి మార్పును తీసుకురా గలరు. గతంలో శరీరం నిండుగా వలువలు(దుస్తులు) మనసు నిండుగా విలువలు కలిగిన వ్యక్తికి సమాజంలో ఎంతో గౌరవం లభించేది నేడు శరీరం పైన వలువలు క్షీణిస్తున్నాయి శరీరం లోపల విలువలు క్షీణిస్తున్నాయి కాబట్టి సమాజంలో నైతిక విలువలపై మార్పు ఒక విద్య తోనే, విద్యార్థులతోనే కాదు ప్రతి వ్యక్తి తనలో మార్పు ద్వారా తీసుకు రాగలరు. కాబట్టి సమాజంలో మనందరం గుర్తుంచుకోవాల్సిన విషయం విలువలు వదిలితే వలువలు వదిలినట్లే..

**విజయ నరసింహాచార్యులు** M. A. B. Ed.,
H. M. స్ఫూర్తి / భవిష్య విద్యాసంస్థలు, సత్తెనపల్లి

## న్యాయ నేత్రం

### చర ఆస్తులు కొనే ముందు కొన్ని విషయాలు చెక్ చేసుకోండి

**షేక్ జానీ ఖాజావలి, న్యాయవాది,** M.Com, LL.B., **9441085206**



ముందుగా ఎవరైనా స్థిర చర ఆస్తులు కొనే ముందు కొన్ని విషయాలు చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. స్థిర ఆస్తులు అనగా స్థిరంగా ఉండేవి అనగా కదలకుండా ఒకే చోట స్థిరంగా ఉండేవి. అనగా ఇళ్లు, స్థలాలు, పొలాలు, భవనాలు, భవంతులు, యంత్రా లు, ఫ్యాక్టరీ లు ఇలాంటి వాటిని స్థిర ఆస్తులు అంటారు. విటిని కొనే ముందు, ముందుగా డాక్యుమెంట్స్ చెక్ చేసుకోవాలి, అది సదరు ఆస్తికి యజమాని ఎవరూ, అందులో ఎవరైనా వారసులు గానీ, భాగస్వాములు గానీ తదితరులు ఎవరైనా ఉన్నారా, అని అడిగి తెలుసుకోవాలి. ఆ డాక్యుమెంట్ ఒరిజినల్ అవునో కాదో చెక్ చేయండి, సదరు ఆస్తికి సంబంధించి ఏమైనా లింకు డాక్యుమెంట్స్ ఉన్నాయా లేదా చూడండి, ఆ లింక్ డాక్యుమెంట్స్ లో ఉన్న షెడ్యూల్ వివరాలు ప్ర జెంట్ డాక్యుమెంట్ షెడ్యూల్ వివరాలు చూడండి,అనగా సర్వే నెంబరు, హద్దులు, స్థలం విస్తరణ ఎంత అన్ని చెక్ చేయాలి, అలాగే ఏమైనా వివాదాలు ఉంటే అనగా పోలీసు కేసులు, ముఖ్యంగా సివిల్ కేసులు ఉంటే జడ్జిమెంట్ పేపర్లు ఉంటే అన్ని క్షుణ్ణంగా పరిశీలించండి. అలాంటి ఆస్తులు ఏమైనా తాకట్టులో ఉన్నాయా గమనించాలి, పేచీలు ఏమైనాఉన్నాయా చూడాలీ. సదరు ఆస్తి అమ్మే వ్యక్తి స్వాధీనం లో ఉందో లేదో. చూసుకోండి. ఫిజికల్ గా ఆ అమ్మే వ్యక్తి షెడ్యూల్ స్థలంలో ఉన్నాడో లేదో స్వయంగా చూడండి. అలాగే రిజిస్టర్ ఆఫీసుకి వెళ్ళి జుజ అంటే encumbrance certificate ఉందో లేదో చూడండి. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే మీరు మీకు నమ్మకమైన ఒక లాయర్ గారిని సంప్రదించి పైన చెప్పిన వివరాలు అన్ని కరెక్ట్ గా చెక్ చేయమని అడుగండి. అలాగే చివరగా ఇంకా అనుమానాలు ఉంటే ఒక లీగల్ నోటీసు ను అనగా బహిరంగ ప్రకటనను వారపత్రికలో ప్రచురితమైనట్లు చేసుకోండి.... అలాగే చరాస్తి అనగా ఏదైనా వాహనాలు అంటే కదిలే వస్తువులు. అంటే టూ వీలర్, ఫోర్, సిక్స్,10, వీలర్ వాహ నాలు, విమానాలు, షిప్స్ ఇంకా వేరే కదలాడు వాహనాలు వీటికి సంబంధించిన డాక్యుమెంట్స్ ను పరిశీలించాలి. అలాగే అవి ఫోర్స్ లో ఉన్నాయో లేవా చూడాలి. ఇన్సూరెన్స్ ఎప్పటి వరకు ఉందో చూడాలి. ఎమైన యాక్సిడెంట్ కేసులు, ఫైనాన్స్ సమస్యలు ఉన్నాయో చూసుకోవాలి. ఇంకా ఏమైనా చట్ట పరమైన సమస్యలు ఉన్నాయో లేదో చూసుకోవాలి, ఏమైనా 100% చట్ట పరంగా ఉంటేనే ఆస్తులు క్రయం విక్రయాలు జరుపుకోవాలి. లేదంటే మీకు తీరని ఆర్థిక నష్టాలు జరగవచ్చు.. ఇంకా కోర్టు కేసులు ఇరుక్కొన్ని ఇంటా, బయట సమస్యలతో సతమతమవుతారు.

## జీవనవేదం

**శిఖా శాంసన్, ఆరోగ్య విస్తరణ అధికారి,** phc **క్రోసూరు, 9849066412**

### కంటి చూపును కాపాడుకోవడం అందరి బాధ్యత



కంటి చూపు విలువ దానిని కోల్పోయినప్పుడే తెలుస్తుందని, ఉన్న చూపును కంటికి రెప్పలా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారి అయినా కంటిచూపు పరీక్షలు చేయించు కోవాలి. చూపు మందగించడం, కళ్ళల్లో నొప్పి, నీరు కారడము, మసక బారడం లాంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే నిర్లక్ష్యము చేయకుండా నేత్ర వైద్యుని సంప్రదించాలన్నారు ప్రస్తుత డిజిటల్ యుగములో మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వాడకం విపరీతంగా పెరిగిపోయిందని దీంతో స్క్రీన్ చూసే సమయంలో కంటి పై తీవ్ర ఒత్తిడి పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు దీని నివారణకు 20-20-20 నియమము పాటించాలని సూచించారు ప్రతి 20 నిమిషాల స్క్రీన్ సమయం తర్వాత, 20 అడుగులుట సుమారు 6 మీటర్లు ఊ దూరంలోని వస్తువును కనీసం 20 సెకండ్లు పాటు చూడటం వలన కంటి అలసట, ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు.



**ఉల్లం పలుకు :** తిరుమల చరిత్ర పుటల్లో వావిలాల ఓ వాస్తవం తమిళనాడులో కలపా లన్న ఆరాష్ట్ర ఉద్యమాన్ని ప్రతిఘటించి ఆంధ్రాలో నిలిపారు మరి వేయికాళ్ళ మండ పాన్ని కూల్చి నారా సార్థకం చేసుకు న్నారా వద్దు బాబు పునర్నిర్మాణానికి పూనుకో పుటల్లో చెరగనిముద్ర ఇలా వేసుకోఅలా మిగిలిపోకు!"

**- ఉల్లం శేషగిరిరావు అడ్వకేట్, హైకోర్టు & సామాజిక విశ్లేషకులు.**

# వైకాపా విజయమే లక్ష్యం: డాక్టర్ గజ్జల సుధీర్

**సత్తెనపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తెనపల్లి పట్టణంలోని 25వ వార్డులో పార్టీ విజయం తథ్యమని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన 25వ వార్డులో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ముందుగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పర్యటనలో భాగంగా వార్డు ప్రజలు, కార్యకర్తలతో మమేకమవుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువతలో ఉత్సాహాన్ని నింపుతూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, నాయకులు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలి. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ రానున్న రోజుల్లో తగిన గుర్తింపు, అన్ని విధాలా సహకారం అందిస్తాం" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, వార్డు ఇన్‌చార్జ్ యాసరపు బాబు, వార్డు పార్టీ ప్రెసిడెంట్ దాండిబోయిన జగన్నాథంలతో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ, పట్టణ స్థాయి అనుబంధ విభాగాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



**సత్తెనపల్లి ప్రతినిధి:** నకరికల్లు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ఏకైక లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తూ, ప్రతి అభ్యర్థి విజయానికి నాయకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను వైఎస్సార్‌సీపీ గుర్తిస్తుందని, రానున్న రోజుల్లో వారికి పార్టీలో సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతం, ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని అన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రాజకీయ కుట్రలు, ఒత్తిళ్లకు పార్టీ శ్రేణులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ గజ్జల ధైర్యం చెప్పారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, మోసపూరిత రాజకీయాలను ప్రజలు ఇప్పటికే అర్థం చేసుకున్నారని, ఎన్నికల సమయంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలకు ఎదురయ్యే ఏ సమస్యనైనా నాయకులు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. కార్యకర్తలకు అండగా పార్టీ ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులకు గుర్తింపు కార్డులను డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, మేడికొండ మస్తాన్ రెడ్డి, భవనం రవీంద్రారెడ్డి, పాలూరి రాజశేఖర్ రెడ్డి, గోపు అంజిరెడ్డి, కొవ్వూరి నర్సయ్య, షేక్ భాషా, షేక్ నన్నేసా, బైరెడ్డి పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్థల వివాదం నేపథ్యంలో దాడి.. వ్యక్తికి గాయాలు!

**ట్రాక్టర్‌తో ఢీకొట్టి, కర్రలతో దాడి చేశారని బాధితుడి ఆరోపణ**



**సత్తెనపల్లి ప్రతినిధి :** పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటన గురువారం చోటుచేసు కుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన అన్నపురెడ్డి కోటిరెడ్డికి గాయాలయ్యాయి. బాధితుడు అన్నపురెడ్డి కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తనకు, మాదల గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసరావు, ఆయన బంధువులకు మధ్య కొంతకాలంగా స్థలానికి సంబంధించి వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో గురువారం తనపై దాడికి పాల్పడినట్లు కోటిరెడ్డి ఆరోపించారు. ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో పాటు కర్రలతో దాడి చేయడంతో తాను గాయపడినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించిన ఆయన బంధువులు వెంటనే కోటిరెడ్డిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్థల వివాదమే దాడికి కారణమని బాధితుడు ఆరోపిస్తుండగా, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



**నర్సరావుపేట:** స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సేవలు అందిస్తున్న ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన శిబిరంలో శుక్రవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గత కొంతకాలంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, అలాగే 'సమాన పనికి సమాన వేతనం' చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో ధర్నా ప్రాంగణంలోనే సదరు ఉద్యోగి ఆకస్మికంగా పాయిజన్ సేవించడంతో అక్కడ ఉన్నతోటి సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధితుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, వెంటనే ఆయనను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు తీవ్ర చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో నర్సరావుపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో తీవ్ర ఉద్రిక్తత, విషాద ఛాయలు అలముకున్నాయి.

# వడ్డవల్లి కర్మకాండల ప్రదేశంలో అపరిశుభ్రత తాండవం!



- **దుర్గంధం, చెత్తాచెదారం, పాముల సంచారం.. విషాద సమయంలోనూ ప్రజలకు తప్పని అవస్థలు!**
- **అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న దుస్థితి.. ఇకనైనా మునిసిపల్ యంత్రాంగం స్పందించేదెప్పుడు?**

**సత్తెనపల్లి ప్రతినిధి:** సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లి ప్రాంతంలో అంత్యక్రియల అనంతరం సంప్రదాయబద్ధంగా కర్మకాండలు నిర్వహించే ప్రదేశం తీవ్ర అపరిశుభ్రతకు నిలయంగా మారడం స్థానిక ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. కుటుంబంలో ఒక వ్యక్తిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారు, తమ ఆత్మీయుల ఆత్మశాంతి కోసం సంప్రదాయాల ప్రకారం చివరి కర్మకాండలు నిర్వహించేందుకు ఈ ప్రాంతానికి వస్తుంటారు. అలాంటి సున్నితమైన సమయంలో వారికి ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నప్పటికీ, అక్కడి పరిస్థితులు మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెత్తాచెదారం పేరుకుపోవడం, పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడం, పిచ్చి మొక్కలు, పొదలు విచ్చలవిడిగా పెరిగిపోవడం వంటి సమస్యలతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పొదల మధ్య పాములు సంచరిస్తున్నాయనే భయంతో కర్మకాండలు నిర్వహించేందుకు వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధలో ఉన్నవారికి, కనీస సౌకర్యాలు లేని ఇలాంటి ప్రదేశంలో కర్మకాండలు నిర్వహించాల్సి రావడం మరింత మానసిక వేదనకు గురిచేస్తోంది. మనిషి జీవితంలో అత్యంత విషాదకరమైన సందర్భాల్లో ఒకటైన మరణానంతర కర్మకాండల సమయంలో కూడా ప్రజలు అపరిశుభ్రత, దుర్వాసన, పాముల భయం మధ్య ఇబ్బందులు పడాల్సి రావడం సత్తెనపల్లి పట్టణ పారిశుధ్య నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

అసలు ప్రశ్న ఏమిటంటే.. ప్రజలకు కనీస పారిశుధ్య వసతులు కల్పించాల్సిన మునిసిపల్ యంత్రాంగం ఏం చేస్తోంది? పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, పిచ్చి మొక్కల నిర్మూలన, ప్రజా ప్రదేశాల పరిశుభ్రతను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? ప్రజలు ఉపయోగించే ఇలాంటి ముఖ్యమైన ప్రదేశాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం లేదా? ఒక ప్రాంతంలో చెత్త పేరుకుపోయి, దుర్గంధం వ్యాపించి, విషపూరిత పాముల సంచారానికి అవకాశం ఏర్పడేంత వరకు పరిస్థితి దిగజారితే, సంబంధిత సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ ఉన్నట్లు? ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు, సమస్యలు మరింత తీవ్రమయ్యే వరకు వేచి చూస్తారా? పారిశుధ్య నిర్వహణ అనేది కేవలం రోడ్లు ఊడ్చడం, ప్రధాన కూడళ్లలో చెత్త తొలగించడం వరకే పరిమితం కాకూడదు. ప్రజలు నిత్యం వినియోగించే ప్రతి ప్రాంతంతో పాటు, మరణానంతర కర్మకాండలు నిర్వహించే ఇలాంటి సున్నితమైన ప్రదేశాల పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు లేదా పొదలు పెరిగినప్పుడు పాములు, ఇతర ప్రమాదకర జీవులు సంచరించే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలి. ప్రజల ప్రాణభద్రతకు ముప్పు కలిగే పరిస్థితులు ఏర్పడకుండా చూడటం అధికారుల ప్రాథమిక బాధ్యత. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నది కేవలం పరిపాలన కొనసాగించడానికే కాదు.. తమకు కనీస పౌర సదుపాయాలు అందుబాటులో ఉండాలనే ఆశతో కూడా. పారిశుధ్యం, ఆరోగ్యకరమైన పరిసరాలు, సురక్షితమైన ప్రజా ప్రదేశాలు ప్రజలకు అందాల్సిన కనీస సదుపాయాలు. వడ్డవల్లి కర్మకాండల ప్రదేశంలో కనిపిస్తున్న దుస్థితి ఈ బాధ్యతల నిర్వహణపై సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. ఈ సమస్యను స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినప్పుడు వాటిని పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసి, శాశ్వత పరిష్కారం చూపించాల్సి ఉంటుంది. కానీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిసినా సమస్య అలాగే కొనసాగితే, అధికారుల స్పందనపై సహజంగానే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. ముఖ్యంగా మరణించిన తమ ఆత్మీయులకు చివరి కర్మకాండలు నిర్వహించేందుకు వచ్చే కుటుంబాలకు కనీస గౌరవం, సౌకర్యం కల్పించలేని పరిస్థితి కొనసాగడం బాధాకరం.

ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి వడ్డవల్లి కర్మకాండల ప్రదేశాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలి. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలి. దుర్గంధానికి కారణమవుతున్న వ్యర్థాలను గుర్తించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలి. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి పాములు సంచరించే అవకాశాలను తగ్గించాలి. అవసరమైన చోట పాముల నివారణకు నిపుణుల సహాయం తీసుకోవాలి. కర్మకాండలు నిర్వహించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నీరు, పారిశుధ్యం వంటి కనీస సదుపాయాల అవసరాన్ని పరిశీలించాలి. ఒక్కసారి శుభ్రం చేసి వదిలేయకుండా, ఈ ప్రాంతంలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. సంబంధిత అధికారులు స్వయంగా ప్రదేశాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. అధికారులకు ఒకటే ప్రశ్న..?? ప్రజలు తీవ్ర విషాదంలో ఉన్న సమయంలోనైనా వారికి కనీస సౌకర్యాలు కల్పించలేకపోతే, ప్రజా అవసరాల పట్ల బాధ్యతాయుతమైన పరిపాలన ఉన్నదని ఎలా చెప్పగలం? వడ్డవల్లి కర్మకాండల ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలనే ప్రజల కోరిక ఏదో ప్రత్యేకమైన డిమాండ్ కాదు.. అది వారి కనీస హక్కు, అధికారుల కనీస బాధ్యత. మరణించిన వారి పట్ల గౌరవం చూపడం, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలగకుండా చూడడం మానవీయ బాధ్యత కూడా. ఈ సమస్యను చిన్న విషయంగా తీసుకొని నిర్లక్ష్యం చేయకుండా, ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలి. వడ్డవల్లి కర్మకాండల ప్రదేశాన్ని చెత్తాచెదారం, దుర్గంధం, పాముల భయం నుంచి విముక్తి చేసి, పరిశుభ్రమైన మరియు సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. మాటలతో కాకుండా క్షేత్రస్థాయిలో పనులు చేసి అధికారులు తమ బాధ్యతను నిరూపించుకోవాలి. సత్తెనపల్లి ప్రజల సమస్యలపై సంబంధిత యంత్రాంగం ఇప్పటికైనా కళ్లు తెరిచి, వడ్డవల్లి కర్మకాండల ప్రదేశం దుస్థితికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.







## కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారి మేరీ శ్రీకళ



**క్రోసూరు :** అవయవాలన్నింటిలోనూ కన్ను అత్యంత ప్రధానమైనదని, కంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మేరీ శ్రీకళ, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ తెలిపారు. ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా క్రోసూరు మండలం దొడ్లేరు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకూరపాడు శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కంటి వ్యాధులపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "లవ్ యువర్ ఐస్" (మీ కళ్ళను ప్రేమించండి) అనే థీమ్‌తో ఈ ఏడాది అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 40 ఏళ్ళు దాటిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం రెండుసార్లు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) సమస్యలతో బాధపడుతున్నవారు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. దృష్టి లోపాలు లేదా అంధత్వ లక్షణాల పట్ల అనుమానం ఉన్నవారు వెంటనే కంటి పరీక్షలు చేయించుకుని, తగిన చికిత్స పొందాలని కోరారు. ఈ శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి ఆప్తామిక్ అసిస్టెంట్ ప్రసన్న కుమార్ రోగగ్రస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఐ స్క్రీనింగ్ కోఆర్డినేటర్ బంకా గంగాధరరావు, ఆరోగ్య కార్యకర్త లావణ్య, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించిన కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే కన్నా



**సత్తెనపల్లి రూరల్:** మండలం పాకాలపాడు గ్రామంలో రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం భూములపై హక్కు తెలిపే పాస్ పుస్తకాలపై కూడా జగన్ బొమ్మలు వేసుకుని రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఆ పద్ధతికి స్వస్తి పలికి, రాజముద్రతో కూడిన పుస్తకాలను పంపిణీ చేస్తోందని, ఇది రైతు భూమికి, ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయతకు చిహ్నమని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కూటమి నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో పోలీసుల ముమ్మర తనిఖీలు

నిర్మల నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ 40 ద్విచక్ర వాహనాలు, ఆటో సీజ్



**సత్తెనపల్లి:** రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నిర్మల నగర్‌లో పోలీసులు ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఐజీ, జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు బలగాల సమన్వయంతో ఈ ముందస్తు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. గత 2019, 2021, 2024 ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన పాత నేరస్థులు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించామని, నిబంధనల ప్రకారం వారిపై బైండోవర్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రాజకీయ నాయకుల అండ ఉందనే ధీమాతో చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు. సత్తెనపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేకంగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలో బందోబస్తును మరింత పటిష్ఠం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని సుమారు 40 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఆపరేషన్‌కు సహకరించిన స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది, మీడియాకు అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

## సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా డి. రాంబాబు



**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లా సత్తెనపల్లి నూతన మున్సిపల్ కమిషనర్‌గా డి. రాంబాబు గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు మున్సి పల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలి కారు. మున్సిపల్ డీఈ మధుసూదన్ రావుతో పాటు పలువురు మున్సిపల్ సిబ్బంది నూతన కమిషన ర్‌కు పూల గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణా భివృద్ధికి, ప్రజలకు మెరుగైన పాలనా సేవలు అందించ డానికి తామందరం సమన్వయంతో, అంకితభావంతో పని చేస్తామని ఈ సందర్భంగా సిబ్బంది కమిషనర్‌కు స్పష్టం చేశారు.

## బోధి పాఠశాలలో గంప నాగేశ్వరరావు ప్రేరణాత్మక కార్యక్రమం

విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంప నాగేశ్వరరావు



**పిడుగురాళ్ల :** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకమైన ప్రేరణాత్మక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రేరణాత్మక వక్త గంప నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో, నిరంతర కృషితో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, కొత్త విషయాలను నేర్చుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. అలాగే పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మంచి అనుబంధం ఎంతో ముఖ్యమని ఆయన వివరించారు. తల్లిదండ్రులు పిల్లలపై కేవలం చదువు, మార్కుల విషయంలో ఒత్తిడి చేయకుండా, వారి ఆలోచనలు, భావాలు, ఆసక్తులను అర్థం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు సమయం కేటాయించి వారితో స్నేహపూర్వకంగా మాట్లాడినప్పుడే వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను కేవలం విద్యార్థులుగా కాకుండా, వారి ప్రత్యేకతలను అర్థం చేసుకుని ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి పిల్లవాడి సామర్థ్యం, నేర్చుకునే విధానం భిన్నంగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఒకే లక్ష్యంతో కలిసి పనిచేసినప్పుడే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని ఆయన



తెలిపారు. విద్యార్థులు AI గురించి అవగాహన పెంచుకుని, దానిని సృజనాత్మకంగా మరియు బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు AIభవిష్యత్తులో అందించే అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు మరియు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల మేడమ్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని అన్నారు. పిల్లలకు మంచి విద్యతో పాటు మంచి విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. గంప నాగేశ్వరరావు ప్రేరణాత్మక సందేశం, AIపై ఆయన అందించిన అవగాహనతో పాటు పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఉండాల్సిన అనుబంధంపై చేసిన సూచనలు విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. ఈ కార్యక్రమం అందరికీ స్ఫూర్తినిచ్చేలా విజయవంతంగా జరిగింది.

## సామాజిక సేవతో కూడిన శాంసన్ ప్రభుత్వ సర్వీస్ ఆదర్శనీయం

**క్రోసూరు:** వైద్య ఆరోగ్య శాఖలో 36 సంవత్సరాల సుదీర్ఘ ప్రభుత్వ సర్వీసును పూర్తి చేసుకున్న సందర్భంగా క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌ను ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. క్రోసూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శాంసన్ తన ఉదారతను చాటుకుంటూ దివ్యాంగులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.ఈ సన్మాన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ.శాంసన్ వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో 36 ఏళ్ల పాటు సమర్థవంతంగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. క్రోసూరు, సత్తెనపల్లి, ఫణిదరం, ఫిరంగిపురం, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ తదితర ప్రాంతాల్లో ఆయన అందించిన సేవలు అభినందనీయమన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, వార్తాపత్రికల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంలో ఆయన దిట్ట అని ప్రశంసించారు. ప్రత్యేకించి కోవిడ్-19 మహమ్మారి సమయంలో బెల్లంకొండ మండలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాగే జాతీయ నాయకుల జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం, విద్యార్థులు, ఉద్యోగులకు క్రీడా, వకృత్వ పోటీలు ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో నిరంతరం ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడం శాంసన్ ప్రత్యేకత అని తెలిపారు. అనంతరం



శాంసన్‌ను దుస్తులు, పూలదండలు, బొకేలు మరియు జ్ఞాపికలతో (మెమెంటోలు) ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, మాజీ ఎంపీపీ అనుముల వెంకట్రామిరెడ్డి, బీజేపీ అధ్యక్షులు దమ్మాలపాటి శ్రీనివాసరావు, ఏపీజీఏ కార్యదర్శి రత్తయ్య, ఏపీ ఎన్జీవో పెదకూరపాడు అధ్యక్షులు వెంకటరావు, బీఎస్పీ నాయకులు గనుపల్లి రాజశేఖర్, రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులు కర్నాటి కృష్ణారావు, షేక్ మస్తాన్, దుద్దుల యెహాన్, యార్డ్ డైరెక్టర్, సీపీఎం నాయకులు హనుమంతరావులతో పాటు వివిధ ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మృతుడు కుటుంబానికి ఆర్థిక సాయం



**బాపట్ల :** బాపట్ల మండలం బేతపూడి గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాస రెడ్డి(వాసు )ఇటీవల ప్రమాదవ శాస్తు మృతి చెందటంతో బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి పరామర్శించి 30000. 00 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో పాటు,, మృతుడు శ్రీనివాస్ రెడ్డికి ఇద్దరు చిన్న పిల్లలు ఉండడంతో మృతుని భార్య నాయుడు అంజలికి ఔట్సోర్సింగ్‌లో ఉద్యోగం ఇవ్వటం జరుగుతుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బేతపూడి టీడీపీ నాయకులు నాయుడు శ్రీనివాస రెడ్డి, కోట గాంధీ రెడ్డి , సాయిబ్ రెడ్డి, పుల్లారెడ్డి, వేదుళ్ళపల్లి టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, గుడిపల్లి సాంబయ్య, వెస్ట్ బాపట్ల టీడీపీ నాయకులు సమ్మెట మల్లికార్జున రెడ్డి, తుమ్మ వెంకటేశ్వర్లు, కావూరి విష్ణు, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తనపల్లిలో వైభవంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం : పోస్టర్లను ఆవిష్కరించిన సిడిపిఓ శ్రీలత



**సత్తనపల్లి:** పట్టణంలోని 30వ వార్డు అంగన్వాడీ సెంటర్ నందు అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 'హెల్ప్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "బాలికలను పుట్టనిద్దాం.. బాలికలను ప్రోత్సహిద్దాం.. బాలికలకు బంగారు భవిష్యత్తును నిర్మిద్దాం" అనే నినాదాలతో కూడిన పోస్టర్లను ఐసిడిఎస్ సత్తనపల్లి ప్రాజెక్టు సిడిపిఓ శ్రీమతి శ్రీలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిడిపిఓ శ్రీలత మాట్లాడుతూ.. "బాల్యవివాహాలను అంతం చేద్దాం - బాలికల హక్కుల కోసం పెట్టుబడి పెడదాం" అనే నినాదాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, డ్వాక్రా సంఘాల ద్వారా బాల్యవివాహాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, ఇంకా అక్కడక్కడ బాల్యవివాహాలు జరగడం విచారకరమన్నారు. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల చదువు, ఆరోగ్యం, ఉన్నతి కోసం ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని బాలికలకు బంగారు భవిష్యత్తు అందించాలని కోరారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరికి బాల్యవివాహం జరుగుతోందని, దాదాపు 133 మిలియన్ల మంది బాలికలు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తనపల్లి పట్టణ సూపర్‌వైజర్ ప్రమీల, రెంటపాళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ ఆశా, అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, అలాగే హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణి, శ్రీలత, రమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయనగర వైభవానికి సజీవ సాక్ష్యం 'సహస్ర స్తంభ మండపం'

**తిరుమల:** తిరుమల కొండలపైన వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక ప్రశాంతతతో పాటు ప్రాచీన భారతీయ శిల్పకళా వైభవం ప్రత్యక్షమవుతుంది. ఆ శిల్పకళా సంపదలో అగ్రతాంబూలం అందుకొని, దశాబ్దాల పాటు భక్తులను ముగ్ధులను చేసిన అద్భుత నిర్మాణం '1000 కాళ్ల మండపం' (సహస్ర స్తంభ మండపం).

**విజయనగర సామ్రాజ్య వైభవం - 16వ శతాబ్దపు శిల్పకళా అద్భుతం**

16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యాధినేత, కళాపోషకుడు శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలంలో ఈ ప్రాచీన మండపం రూపు దిద్దుకుంది. విజయనగర శిల్పుల అసమాన నైపుణ్యానికి, ఊహాశక్తికి ఈ సహస్ర స్తంభ మండపం ఒక సజీవ ప్రతీకగా నిలిచింది. రాతి స్తంభాలపై శిల్పులు చెక్కిన శిల్పాలు కేవలం రాతి నిర్మాణాలు కావు; అవి ప్రాణ ప్రతిష్ఠ పొందిన ఆధ్యాత్మిక కావ్యాలు. ఒక్కో స్తంభంపై చెక్కిన నరసింహస్వామి, వేణుగోపాలస్వామి, హనుమంతుడు, గరుత్మంతుడు తదితర దేవతా మూర్తుల విగ్రహాలు, నాట్య భంగిమలు, అద్భుత శిల్పకళా రీతులు చూసి భక్తులు మైమరచిపోయేవారు. రాతిని సైతం పూవులా మలచి, ప్రతి శిల్పంలోనూ భావాన్ని ఉట్టిపడేలా చేసిన నాటి శిల్పుల ప్రతిభ విశ్వవిఖ్యాతమైనది.

**శ్రీవారి ఉత్సవాలకు పవిత్ర వేదిక**

కేవలం భవన ప్రాంగణంగానే కాక, శ్రీవారి నిత్య, నైమిత్తిక ఉత్సవాల్లో ఈ మండపం అత్యంత కీలక పాత్ర పోషించేది. తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో ఉత్సవ మూర్తులను ఈ మండపంలోనే వేంచేపు చేసి విశేష పూజలు నిర్వహించేవారు. డోలోత్సవం (ఊంజల్ సేవ), వసంతోత్సవాలు, రథోత్సవాల వేళ స్వామివారు, అమ్మవార్లు ఈ సహస్ర స్తంభ మండపంలో కొలువుదీరి భక్తులకు దివ్య దర్శనమిచ్చేవారు. పగటి వేళల్లో వేలాది మంది భక్తులు ఈ శిల్పకళా సౌందర్యాన్ని తిలకిస్తూ ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందేందుకు ఈ మండపం నిలయంగా ఉండేది.

**కాల పరీక్షను తట్టుకున్న సాంస్కృతిక వారసత్వం**

శతాబ్దాల పాటు తిరుమలకు వచ్చిన కోట్లాది మంది భక్తులకు కంటిపాపలా కనిపించి, శ్రీవారి సన్నిధికి ఒక రక్షణ కవచంలా, వైభవానికి మకుటంలా ప్రకాశించిన ఈ 1000 కాళ్ల మండపం తిరుమల చారిత్రక నమూనాలో చెరగని ముద్ర వేసింది. విజయనగర రాజులు శ్రీవారికి సమర్పించిన అత్యంత పవిత్రమైన, విలక్షణమైన కానుకల్లో ఈ సహస్ర స్తంభ మండపం ఎల్లప్పుడూ అగ్రస్థానంలోనే నిలుస్తుంది.

**కళాఖండానికి కావలసింది కేవలం స్థల కేటాయింపే!**

తిరుమల కొండపైన విజయనగర వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన '1000 కాళ్ల మండపం' (సహస్ర స్తంభ మండపం) పునర్నిర్మాణంపై భక్తులలో, ఆధ్యాత్మిక వేత్తలలో నేటికీ ఆశలు సజీవంగానే ఉన్నాయి. భక్తుల రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ మరియు ఆలయ పరిసరాల విస్తరణ దృష్ట్యా గతంలో ఈ ప్రతిష్టాత్మక నిర్మాణాన్ని తొలగించక తప్పలేదు. అయితే, దశాబ్దాలు గడుస్తున్నా ఈ చారిత్రక శిల్ప సంపద పునరుద్ధరణ ఎప్పుడు జరుగుతుందో,



రాబోయే తరాలకు ఈ వైభవం ఎలా లభ్యమవుతుందో స్పష్టత కరువైంది.

చరిత్రను భవిష్యత్తుకు అందించే బాధ్యత విజయనగర రాజుల కాలంలో మలిచిన ఒక్కో రాయి నాటి శిల్పుల నైపుణ్యానికి, భక్తిప్రపత్తులకు అద్దం పడుతుంది. ఈ ప్రాచీన రాళ్లు, స్తంభాలు నేటికీ సురక్షితంగానే ఉన్నప్పటికీ, అవి కాల గర్భంలో కలిసిపోకుండా ఉండాలంటే తక్షణమే కార్యాచరణ అవసరం. రాబోయే కాలంలో మన సంస్కృతి, చరిత్ర మరియు ప్రాచీన శిల్పకళా సౌందర్యం భావి తరాలకు తెలియాలంటే ఈ మండపం పునర్నిర్మాణం అత్యంత ఆవశ్యకం.

**స్థల కేటాయింపే ప్రధాన పరిష్కారం**

ట్రాఫిక్ మరియు రద్దీ సమస్యల వల్ల మూల ఆలయం ఎదుట పాత ప్రదేశంలో దీనిని తిరిగి నిర్మించడం వీలుకాకపోయినా, తిరుమలలోని వేరే అనుకూల ప్రాంతంలో ఈ మండపానికి స్థలం కేటాయిస్తే సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.

ప్రత్యామ్నాయ ప్రదేశాలు: తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాలు లేదా భక్తుల రద్దీకి ఆటంకం కలగని ఇతర పవిత్ర ప్రాంగణంలో తగినంత స్థలాన్ని కేటాయించవచ్చు.

ఆధ్యాత్మిక ఉపయోగం: వేరే స్థలంలో ఈ సహస్ర స్తంభ మండపాన్ని పునర్నిర్మించడం వల్ల శ్రీవారి ఊంజల్ సేవలు, వసంతోత్సవాలు, సాంస్కృతిక ప్రదర్శనలకు ఒక దివ్య వేదిక లభిస్తుంది. అదే సమయంలో భక్తులు ప్రశాంతంగా ఈ శిల్పకళను తిలకించే అవకాశం దక్కుతుంది.

చరిత్రను కాపాడుకోవడం అంటే మన మూలాలను గౌరవించడమే. ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా తొలగించిన ఈ శిల్పకళా నిలయానికి, తిరుమలలో ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి పునర్నిర్మాణాన్ని పూర్తి చేస్తే, అది రాబోయే తరాలకు మన సాంస్కృతిక వారసత్వాన్ని పదిలంగా అందించే గొప్ప ఆధ్యాత్మిక కార్యం అవుతుంది.







## క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించాలి

**ఢిల్లీ** : దేశ రాజధాని ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న వరుస అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మహిళలపై నేరాలు పాల్పడే వారి గుండెల్లో భయం పుట్టించాల్సిన అవసరం ఉందని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. "మహిళల భద్రతకు సంబంధించిన చర్యలు పేపర్లకే పరిమితం కాకూడదు. మేం సురక్షితంగా ఉన్నామని ప్రతి మహిళా భావించేలా మన చర్యలు ఉండాలి. రాత్రి 11 గంటల సమయంలో కూడా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలు రోడ్లపై, మెట్రోలో స్వేచ్ఛగా, భద్రంగా తిరిగే పరిస్థితులు కల్పించాలి. నేరాలు జరిగిన తర్వాత ఏం చేశామన్నదానికంటే కూడా.. వాటిని కట్టడి చేయడమే అత్యంత ముఖ్యమైన అంశం. ఇలాంటి నేరం చేస్తే ప్రాణాలు పోతాయి అని క్రిమినల్స్ గుండెల్లో భయం పుట్టించినప్పుడే.. వీటిని మనం అరికట్టగలం" అని సుప్రీంకోర్టు వెల్లడించింది.

మహిళలపై నేరాల కట్టడికి పోలీసులు కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోవచ్చని న్యాయస్థానం సూచించింది. "ఈ విషయంలో కొంత కర్కశంగా ఉన్నా వెనుకాడొద్దు. మానవహక్కుల వంటి సమస్యలు ఎదురైనా.. అవసరమైనప్పుడు కఠిన చర్యలు తీసుకోండి" అని కోర్టు పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో నిరంతర పెట్రోలింగ్‌ను మరింత పెంచాలని న్యాయస్థానం ఈ సందర్భంగా సూచించింది. సీసీటీవీలు నిరంతరం పనిచేసేలా చూడాలని తెలిపింది. ఇటీవల ఢిల్లీలోని ఓ పార్కులో 17ఏళ్ల అమ్మాయిపై సామూహిక అత్యాచారం జరిగిన సంగతి తెలిసిందే. అంతకుముందు, స్వరూప్ నగర్‌లోని ఓ టీనేజ్ అమ్మాయిని కొంతమంది దుండగులు గ్యాంగ్‌రేప్ చేసి చంపిన ఘటన వెలుగుచూసింది. ఇక, స్లీపర్ బస్సులో మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. వీటిపై సుమోటోగా విచారణ చేపట్టింది.

## ప్రయాణికులపై మరింత భారం..

**ఢిల్లీ** : దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై ఇంధన సర్‌ఛార్జీలను పెంచింది. వరుసగా మూడు నెలలుగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరగడం. దాంతో నిర్వహణ వ్యయాలు భారం కావడంతో ఈ ఛార్జీలను పెంచినట్టు విమానయాన సంస్థ వెల్లడించింది. అక్టోబర్ 6 నుంచి జరిగే కొత్త బుకింగ్‌లకు ఈ ధరలు వర్తిస్తాయని చెప్పింది. ఈ పెంపుతో విమాన ప్రయాణాలు భారం కానున్నాయి. దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు ఈ పెంపు రూ. 100 నుంచి రూ. 350 వరకు ఉండనుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాంతో ఏటీఎఫ్ వ్యయం గత దశాబ్ద కాలంలోనే అత్యధిక స్థాయికి చేరిందని ఇండిగో వెల్లడించింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ ఖర్చులదే గణనీయమైన వాటా ఉండటంతో.. ఈ ధరల పెరుగుదల తమతో సహా అన్ని విమానయాన సంస్థల ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

## ఏఐ ప్రయాణించే మార్గం సరైనది కాదు

**ఢిల్లీ** : వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏఐ సాంకేతికతను నియంత్రించకుండా వదిలేస్తే.. అది మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని పలువురు టెక్ అధినేతలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ అభివృద్ధికి కృషి చేసిన పలువురు కీలక సంస్థల నిపుణులు పదవుల నుంచి వైదొలుగుతున్నారు. ఈ జాబితాలో తాజాగా ఓపెన్ ఏఐ సేఫ్టీ సిస్టమ్ అధిపతి డేవిడ్ రాబిన్సన్ చేరారు. ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం సరైనది కాదని ఆరోపిస్తూ తన పదవికి రాజీనామా చేశారు.

"ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం ఆమోదయోగ్యం కాదని భావించిన OpenAI లోని మాజీ సహోద్యోగులు, పరిశ్రమలోని ఇతర అధికారుల వరుసలో ఇప్పుడు నేను కూడా చేరుతున్నాను. ఏఐ భవిష్యత్తు.. దానిని నిర్మించే కంపెనీలపై ఆధారపడి ఉంది. ఆ విషయంలో కంపెనీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రమాదకరమైన టెక్నాలజీని ఎలా ఎదుర్కోవాలనే వివేకం వాటికి ఉండట్లేదు. ఇందు కోసం కొంత వినయం అవసరం. అయితే.. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే వ్యక్తులకు సహజంగా వివేకం ఉండదు. ఏఐ భద్రత పట్ల మరింత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

సమస్యలు వచ్చిన తర్వాత రక్షణ చర్యలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేపట్టడం సరైన చర్య కాదు. ఇటీవల పలు ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించాయి. 'హగ్గింగ్ సేఫ్' డేటాను హ్యాక్ చేసిన సమయంలో ఓపెన్ ఏఐ పొరపాటున ఏఐ ఏజెంట్ల సమూహాన్ని బయటకు వదిలింది. దీంతో శిక్షణలో ఉన్న మోడల్ ఇంటర్నెట్ యాక్సెస్ పరిమితులను దాటింది. కాబట్టి మానవుల కంటే ఎక్కువ సామర్థ్యం గల వ్యవస్థలను నిర్మించడానికి ఇది సరైన సమయం కాదు. ఏఐలో విపరీతమైన పురోగతి వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది" అని డేవిడ్ రాబిన్సన్ పేర్కొన్నారు. 2023లో ఓపెన్ ఏఐలో చేరిన డేవిడ్ మొదట పాలసీ ప్లానింగ్ హెడ్‌గా.. ఆ తర్వాత దాని సేఫ్టీ సిస్టమ్స్ బృందంలో కీలక అధికారిగా ఎదిగారు.

## జీఎస్టీ 2.0.. ఇక 'నో అరెస్ట్'.. నో టెన్షన్!

**ఢిల్లీ** : దేశంలో పరోక్ష పన్నుల వ్యవస్థను సమూలంగా మార్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ఇప్పుడు జీఎస్టీ 2.0 రూపంలో కొత్త మలుపు తిరుగుతోంది. వ్యాపార వాణిజ్య సంస్థల నుంచి వస్తున్న డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేస్తూ కొన్ని మార్పులకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం, పారదర్శకతను పెంచడమే ఈ నూతన సంస్కరణల ప్రధాన ఉద్దేశం. జీఎస్టీ 2.0లో భాగంగా రీఫండ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు రీఫండ్ల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఇకపై సాంకేతికతను జోడించి ఆటోమేటెడ్ పద్ధతిలో రీఫండ్లను వెంటనే విడుదల చేసేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. దీనివల్ల మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలకు వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి. అంతేకాకుండా, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ పరిధిని విస్తరించడం మరొక కీలక పరిణామం. వ్యాపార వ్యయాలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మును పటి నిబంధనలతో ఉన్న సందిగ్ధతలను తొలగిస్తూ ఐటీసీ ప్రయోజనాలను మరింత మంది వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావడం హర్షణీయం. వీటన్నింటికంటే ముఖ్యంగా పన్ను ఎగవేత లేదా చిన్నపాటి పొరపాట్లకు అరెస్టులు చేయకూడదనే నిర్ణయం వ్యాపార వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అనవసరమైన భయాందోళనలను తొలగించి పన్ను చెల్లింపుదారులు, అధికారుల మధ్య నమ్మకాన్ని పెంపొందించడం లక్ష్యంగా 'నో అరెస్ట్' విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకువస్తోంది. ఇది దేశంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మెరుగుపరచడమే కాకుండా పన్నుల వసూలును మరింత హేతుబద్ధం చేస్తుంది.

## హోంగార్డు ఉద్యోగం కోసం వితంతు మహిళ సాహసం



**రాంచీ** : సంకల్పం బలంగా ఉంటే ఎంత కష్టతరమైన లక్ష్యమైనా చిన్నబోవాల్సిందేనని రుజువు చేసింది జార్ఖండ్‌కు చెందిన ఒక వితంతు మహిళ. ఇద్దరు పిల్లలు, అత్తామామలను పోషించాలంటే ఎలాగైనా హోంగార్డు ఉద్యోగాన్ని సాధించి తీరాలన్న తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంది. కనీసం స్పోర్ట్స్ షూ, ట్రాక్ సూట్ కూడా కొనలేని పేదరికంలో చీరతోనే చెప్పులు లేకుండా మండుటెండలో 1600 మీటర్ల దూరాన్ని కేవలం ఆరు నిమిషాల్లో పూర్తి చేసి భేష్ అన్పించుకుంది. రామ్‌గర్ దుల్మీ బ్లాక్ సోసో గ్రామానికి చెందిన కవితా కుమారి రామ్‌గర్‌లో జరిగిన హోంగార్డు నియామక ఫిజికల్ టెస్ట్‌కు హాజరైంది. 10 నిమిషాల్లో పూర్తి చేయాల్సిన 1600 మీటర్ల రన్‌ను ఆరు నిమిషాల్లోనే పూర్తి చేసింది. కాళ్లకు చెప్పులు లేకుండా ఒట్టికాళ్లతో చీరతోనే రన్నింగ్ చేస్తున్న ఆమె వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఆమె స్ఫూర్తి, పట్టుదలను అందరూ మెచ్చుకుంటున్నారు. స్థానిక రన్నింగ్ అకాడమీ అధికారులు ఇంటికి వెళ్లి అమెను సన్మానించారు. తన బిడ్డలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలంటే హోంగార్డు ఉద్యోగం పొందడమొక్కటే మార్గమని తలచి దాని ఎంపిక కోసం ప్రతి రోజూ ఉదయాన్నే నాలుగు గంటలకు లేచి రన్నింగ్ ప్రాక్టీస్ చేసినట్టు ఆమె తెలిపింది. చెప్పులు, ట్రాక్‌సూట్ కొనే ఆర్థిక పరిస్థితి తనకు లేదని చెప్పింది. 284 హోంగార్డుల ఉద్యోగాలకు జరిగిన ఈ రిక్రూట్‌మెంట్‌లో 50 శాతం మహిళలకు కేటాయించారు. అందులో 5 శాతం వితంతువులకు, విడాకులు పొందిన మహిళలకు కేటాయించారు.

## కొత్త మార్పులతో గ్రూప్-1



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. 166 గ్రూప్-1 సర్వీసు పోస్టులతో పాటు ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో 40 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్స్, ఉద్యాన శాఖలో 37 హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేసింది. అభ్యర్థులు ఈ నెల 27వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను వచ్చే ఏడాది జనవరి 24న ఆఫ్‌లైన్ (ఓఎంఆర్) పద్ధతిలో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే ఓటీపీఆర్ అప్‌డేట్‌కు అవకాశం కల్పించిన సర్వీస్ కమిషన్.. తాజా నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాల భర్తీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

**తొలిసారి డీఈవో పోస్టుల భర్తీ**

పాఠశాల విద్యాశాఖ చరిత్రలోనే మొదటిసారిగా 14 జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) పోస్టులను తాజా గ్రూప్-1 ద్వారా నేరుగా భర్తీ చేస్తున్నారు. గతంలో డీఈవో పోస్టులను కేవలం డిప్యూటీ డీఈవో లేదా సమాన కేడర్ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు సీనియారిటీ ఆధారంగా పదోన్నతి కల్పించి నియమించేవారు. తాజాగా సర్వీస్ నిబంధనలను సవరించి మొత్తం డీఈవో పోస్టుల్లో 50% గ్రూప్-1 ద్వారా నేరుగా, మిగిలిన 50% పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు.

**95 శాతం లోకల్ రిజర్వేషన్.. డిజిటల్ మూల్యాంకనం**

రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలులో భాగంగా లోకల్ రిజర్వేషన్ విధానాన్ని ఈ నోటిఫికేషన్ నుంచే అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా 95% పోస్టులను స్థానిక (లోకల్) అభ్యర్థులకు, కేవలం 5% పోస్టులను మాత్రమే ఓపెన్ (నాన్-లోకల్/ఓపెన్ కాంపిటీషన్) కోటా కింద కేటాయించారు. గతంలో ఉన్న మహిళల వర్టికల్ రిజర్వేషన్ విధానంలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో తాజాగా 33 1/3 శాతం రిజర్వేషన్‌ను ఎలాంటి రోస్టర్ పాయింట్లు లేకుండా సమాంతరంగా (హారిజాంటల్ ఇంటర్ లాకింగ్) అమలు చేయనున్నారు. క్రీడాకారులకు 3 శాతం కోటాను వర్తింపజేశారు. సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం షెడ్యూల్డ్ కులాలను గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3గా విభజిస్తూ తొలిసారి రోస్టర్ పాయింట్లతో ఖాళీలను కేటాయించారు. సంప్రదాయ పద్ధతితో పాటు డిజిటల్ ఎవాల్యుయేషన్ విధానాన్ని పరిశీలించే నిబంధనను పొందుపరిచారు.

**స్థానికతపై ఆందోళన**

తాజా నోటిఫికేషన్‌లో స్థానికత నిర్ధారణకు పాఠశాల విద్యను ప్రాతిపదికగా తీసుకున్నారు. మొదటి నిబంధన ప్రకారం 7వ తరగతితో కలిపి అంతకుముందు వరుసగా 4 సంవత్సరాలు ఎక్కడ చదివితే ఆ ప్రాంతమే స్థానికత. మొదటి నిబంధన వర్తించకపోతే, 1 నుంచి 7 తరగతుల మధ్య ఎక్కువ కాలం ఎక్కడ చదివితే ఆ ప్రాంతం పరిగణనలోకి వస్తుంది. సమాన కాలమైతే చివరిగా చదివిన ప్రాంతం వర్తిస్తుంది. రెగ్యులర్ స్కూలింగ్ లేనివారు నివసించిన ప్రాంతం ఆధారంగా, నేరుగా ఓపెన్ ద్వారా డిగ్రీ చేసినవారు రెసిడెన్స్ సరి?టిఫికెట్ ఆధారంగా స్థానికులుగా అర్హులు. కమిషన్ ఆదేశాల మేరకు అభ్యర్థులు వన్-టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) వివరాలు అప్‌డేట్ చేస్తుండగా.. వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా 1వ తరగతి వివరాలు నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో 7వ తరగతి వరకు బడికి వెళ్లకుండా నేరుగా ఓపెన్ డిగ్రీ చేసిన అభ్యర్థులకు ఓటీపీఆర్ అప్‌డేట్ కాక ఆందోళన చెందుతున్నారు.

**వివిధ విభాగాలలో పోస్టుల ఖాళీలు ఇలా..** గ్రూప్-1 సర్వీసెస్‌లో 166, ఏపీ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులు 41, హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులు 37, ఏపీ స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇంజనీరింగ్/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/బయాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 8 ఉన్నాయి. పూర్తి వివరాలకు సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov. in లో చూడవచ్చు.

# సచివాలయాల సేవలకు కోత



**అమరావతి:** గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై కక్షగట్టిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం వాటి ద్వారా ప్రజలకందే సేవల్లో కోతలు మొదలుపెట్టింది. విద్యార్థులు, రైతులకు ఎక్కువ అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పట్టదారు పాస్‌పుస్తకాలు, నీటితీరువా చెల్లింపు సేవల్ని సచివాలయాల నుంచి దూరం చేసింది. రెవెన్యూశాఖకు సంబంధించి కీలకమైన ఈ నాలుగు సేవలు ప్రజలకు ఎంతో అవసరం. గతంలో ప్రభుత్వాఫీసుల్లో చిన్నపని పడినా గ్రామీణ ప్రాంత ప్రజలు తమ రోజువారీ పనులన్నీ మానుకుని మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్లి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

ప్రజలకు ఈ ఇబ్బందుల్ని తప్పించి వారి గ్రామాల్లోనే, ఇళ్లవద్దే సేవలు అందించేందుకు గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 540కి పైగా ప్రభుత్వ సేవల్ని ఈ సచివాలయాల్లో అందుబాటులో తీసుకొచ్చింది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,004 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలు దాదాపు 10 కోట్ల సేవలను పొందారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం తాజాగా ప్రజలకు ప్రతి సందర్భంలోను ఎక్కువ అవసరం పడే కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల పునఃజారీ (రీ ఇష్యూ), పట్టాదారు పాస్‌బుక్ పునఃముద్రణ (రీ ప్రింట్), రైతుల నీటితీరువా పన్ను చెల్లింపు సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో పూర్తిగా నిలిపేసింది.

సచివాలయాలతోపాటు మీ-సేవ కేంద్రాల్లోను ఆ సేవలు లేకుండా చేసింది. విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు చదువులకు, ఉద్యోగాలకు, పథకాలకు దరఖాస్తు చేసుకునేటప్పుడు.. గతంలో తమకు మంజూరైన కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల పునఃజారీకి సచివాలయాల్లో దరఖాస్తు చేసి మళ్లీ తీసుకుంటారు. ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఆ సేవల్ని దూరం చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**ఊళ్లోనే ప్రజలకు సేవలందించే వ్యవస్థను కనుమరుగు చేసేందుకేనా?**

ప్రజలకు సొంత ఊళ్లలోనే ఆయా సేవలను అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను క్రమంగా కనుమరుగు చేసేందుకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ఆరోపణలున్నాయి. అందుకే రెండేళ్లుగా సచివాలయ వ్యవస్థపై చంద్రబాబు, మంత్రులు విషం చిమ్ముతున్నారన్న విమర్శలున్నాయి. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ కోసం గత ప్రభుత్వం ఒకేసారి 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టడాన్ని అనవసరంగా చేసినట్లు చంద్రబాబు, మంత్రులు నిందలు వేస్తూ వస్తున్నారు. అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రేషనలైజేషన్ పేరిట ఒక్కో సచివాలయంలో ఉండే ఉద్యోగుల సంఖ్యను కుదించిన విషయం తెలిసిందే.

ఇప్పుడు ఆ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందే ప్రభుత్వ సేవలను కూడా దూరం చేస్తున్నారు. ఇలా ఒక్కో సేవను దూరం చేస్తూ.. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ.. చివరికి ఈ వ్యవస్థనే పూర్తిగా నిర్మూలించేదిశగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న విమర్శలున్నాయి. అందులో భాగంగానే ఇప్పుడు సచివాలయాల్లో అందే ప్రభుత్వ సేవల్లో కోతలు విధించిందన్న చర్చలు నడుస్తున్నాయి. మరోవైపు సచివాలయ ఉద్యోగులను ఇంటింటి ప్రభుత్వ సర్వేలకు, అధికార పార్టీలకు ఉపయోగపడే ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే రాజకీయ ప్రచార కార్యక్రమాలకే ఎక్కువగా ఉపయోగించుకుంటున్న తీరును ఉద్యోగులు తీవ్రంగా తప్పుపడుతూ ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

# గర్భిణుల్లో గగుర్పాటు

**అమరావతి:** పెరుగుతున్న ఉష్ణోగ్రతలు గర్భిణులు, గర్భస్థ శిశువులు, నవజాత శిశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అధిక వేడి కారణంగా మహిళలు గర్భధారణ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముందస్తు ప్రసవాలు జరగడం, శిశువు ఎదుగుదలలో లోపాలు వంటివి ఉత్పన్నమవుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై బ్రిటన్‌కు చెందిన వెల్‌కమ్ అనే అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధన సంస్థ భారత్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, బ్రిటన్, జింబాబ్వే దేశాల్లో ఇటీవల నిర్వహించిన సర్వే నివేదికను తాజాగా వెల్లడించింది. సర్వేలో మొత్తం వెయ్యి మంది మాతా, శిశు, ఆరోగ్య నిపుణులు పాల్గొన్నట్టు తెలిపింది.

**సర్వే వివరాలు ఇలా..**

గర్భిణుల్లో వేడి కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలు గత ఐదేళ్లలో పెరిగాయని 73 శాతం మంది వైద్య నిపుణులు చెప్పారని వెల్లడించింది. మరో 76 శాతం మంది వైద్యులు గర్భస్థ శిశువులు, నవజాత శిశువుల ఆరోగ్యంపై వేడి ప్రభావం పెరిగిందని తెలిపారని పేర్కొంది. సర్వేలో పాల్గొన్న వైద్య నిపుణుల్లో 98 శాతం మంది తీవ్ర వేడి కారణంగా ఆరోగ్యం దెబ్బతిన్న గర్భిణులకు చికిత్స అందించినట్లు తెలిపారని పేర్కొంది. 99 శాతం మంది వేడి ప్రభావంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్న శిశువులను కూడా చూసినట్టు చెప్పారని వెల్లడించింది.

**గుర్తించిన సమస్యలు ఇవీ**

అధిక ఉష్ణోగ్రతల కారణంగా మహిళల్లో గర్భధారణ సమస్యలను గుర్తించినట్టు సర్వేలో పాల్గొన్న 23 శాతం మంది నిపుణులు వెల్లడించారు. తక్కువ బరువుతో శిశు జననాలు, శిశువు ఎదుగుదలలో లోపాలు, ఇలాంటి సమస్యలను గుర్తించినట్టు మరో 34 శాతం మంది నిపుణులు తెలిపారు. ఇక నవజాత శిశువుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 36 శాతం మంది వైద్యులు డీహైడ్రేషన్, వేడి కారణంగా అనారోగ్యానికి గురైన శిశువులను చూసినట్టు వెల్లడించారు. మరో 33 శాతం మంది శిశువులు పాలు తాగడంలో, శ్వాస తీసుకోవడంలో, శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడంలో ఇబ్బందులు కనిపించాయని తెలిపారు.

**వైద్యం చేయించుకోవడమూ గగనమే**

అధిక ఉష్ణోగ్రతల కారణంగా వైద్య సేవలు పొందడం కూడా కష్టమవుతోందని 27 శాతం మంది వైద్య నిపుణులు తెలిపారు. మరో 29 శాతం మంది అత్యవసర వైద్య సేవలను ఆశ్రయించే కేసులు పెరిగాయని చెప్పారు. ప్రతి డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలతో ముందస్తు ప్రసవం జరిగే అవకాశాలు సుమారు 5 శాతం పెరుగుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి.

**రానున్న రోజుల్లో మరింత ముప్పు**

తీవ్ర వేడి ప్రభావం భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 81 శాతం మంది నిపుణులు వచ్చే ఐదేళ్లలో గర్భిణులు, గర్భస్థ శిశువులు, నవజాత శిశువుల ఆరోగ్యానికి తీవ్రమైన వేడి పెద్ద ముప్పుగా



మారుతుందని అభిప్రాయపడ్డారు.

**సూచనలు ఇవీ** : గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులను జాతీయ వాతావరణ--ఆరోగ్య ప్రణాళికల్లో ప్రత్యేకంగా చేర్చాలని 'వెల్‌కమ్' సంస్థ కోరింది. వేడి తీవ్రతను ముందుగానే హెచ్చరించే వ్యవస్థలు, చల్లటి వాతావరణం కల్పించే సదుపాయాలు, మెరుగైన వైద్య పర్యవేక్షణను అందుబాటులోకి తీసుకురావాలని సూచించింది. అలాగే గర్భధారణ, ప్రసవానంతర కాలంలో తీవ్ర వేడి ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక వైద్య మార్గదర్శకాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) రూపొందించాలని కోరింది.

## సమ్మెలోకి వైద్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు




**అమరావతి:** డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ వైద్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె ప్రారంభించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించారు. అత్యవసర సేవలు మినహా మిగిలిన వైద్య సేవలన్నింటినీ స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఇతర సహాయ సిబ్బంది బహిష్కరించారు. 28 జిల్లాల్లో జీజీహెచ్.. ఇతర ఆస్పత్రుల్లో ఆందోళనలు చేపట్టారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత ఉన్నతాధికారులు పలుమార్లు చర్చలు జరిపారు. డిమాండ్‌లు పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఏపీ వైద్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మెలో రాష్ట్రవ్యాప్తంగా 14 వేల మందికిపైగా ఉద్యోగులు భాగస్వామ్యమయ్యారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు, సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సర్వీస్ రెగ్యులర్ చేసే వరకూ 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కోరారు. వీరి సమ్మెతో వైద్య సేవలు స్తంభించిపోయి రోగులు అవస్థలు పడ్డారు. సెకండరీ హెల్త్, డీఎంఈ పరిధిలోని ఆస్పత్రులపై ఉద్యోగుల సమ్మె తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం నుంచి అత్యవసర సేవలను కూడా బహిష్కరించాలని నిర్ణయించారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో సమ్మెను తీవ్రతరం చేస్తామని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, కన్వీనర్ అజయ్ ప్రకటించారు.

## దుర్గాష్టమి, మహానవమిపై గందరగోళం?



రాబోయే దేవీ నవరాత్రుల్లో దుర్గాష్టమి, మహా నవమి పూజల తేదీలపై భక్తుల్లో గందరగోళం నెలకొంది. అష్టమి వ్రతం ఎప్పుడు చేయాలి? కుమారీ పూజ ఏ రోజు నిర్వహించాలి? నవమి పూజకు సరైన సమయం ఏది? అనే సందేహాలకు పండితులు సరైన శుభ సమయాలు తెలియజేశారు. 2026లో శారదా నవరాత్రులు అక్టోబర్ 11న ప్రారంభమై, అక్టోబర్ 20న విజయదశమితో ముగుస్తాయి.

**అక్టోబర్ 19న దుర్గాష్టమి**

అష్టమి తిథి అక్టోబర్ 18న ఉదయం 8:27 గంటలకు ప్రారంభమై, అక్టోబర్ 19న ఉదయం 10:51 గంటలకు ముగుస్తుంది. ఉదయ తిథి ప్రకారం అక్టోబర్ 19నే అష్టమిగా పరిగణిస్తారు. అందువల్ల ఆ రోజున అష్టమి వ్రతం, ప్రత్యేక పూజలు, హోమాలు, కుమారి పూజ నిర్వహించవచ్చు. ఈ రోజు దుర్గాదేవి ఎనిమిదో రూపమైన మహాగౌరి అమ్మవారిని పూజిస్తారు.

**కుమారి పూజకు అష్టమి సమయం**

అష్టమి సందర్భంగా కుమారి పూజ నిర్వహించే వారు అక్టోబర్ 19న చేయవచ్చు. వీలైనంత వరకు అష్టమికి సంబంధించిన పూజలు, కుమారి పూజను ఉదయం 10:51 గంటలకు ముందే పూర్తి చేయాలని పండితులు సూచించారు. అయితే కొన్ని కుటుంబాల్లో దుర్గాష్టమి పూజను రాత్రివేళ నిర్వహించే సంప్రదాయం ఉంది. అలాంటి వారు అక్టోబర్ 18 రాత్రి అష్టమి తిథి ప్రారంభమైన తర్వాత తమ కుటుంబ సంప్రదాయం ప్రకారం పూజ చేయవచ్చు.

**10:51 తర్వాత మహానవమి**

అక్టోబర్ 19న ఉదయం 10:51 గంటలకు అష్టమి ముగిసి, వెంటనే నవమి తిథి ప్రారంభమవుతుంది. దీంతో అదే రోజు ఉదయం 10:51 గంటల తర్వాత మహానవమి పూజ, హోమాలు, కుమారిపూజ నిర్వహించవచ్చు. అంటే అక్టోబర్ 19న అష్టమి, నవమి రెండింటికీ సంబంధించిన కుమారిపూజ చేసే అవకాశం ఉంది.

**అక్టోబర్ 20న కూడా నవమి పూజ**

ఉదయ తిథికి ప్రాధాన్యం ఇచ్చేవారు అక్టోబర్ 20న కూడా మహానవమి పూజ, కుమారిపూజ చేసుకోవచ్చు. అయితే ఆ రోజు నవమి తిథి మధ్యాహ్నం 12:50 గంటల వరకు మాత్రమే ఉంటుంది. కాబట్టి అక్టోబర్ 20న నవమి పూజ, హోమాలు లేదా కుమారిపూజ చేసేవారు మధ్యాహ్నం 12:50 గంటలలోపు పూర్తి చేయాలి. మహానవమి వ్రతం పాటించేవారు అక్టోబర్ 19న ఉపవాసం ఉండి, దుర్గాదేవిని పూజించి, మరుసటి రోజు విజయదశమి నాడు వ్రతాన్ని విరమించవచ్చని పండితులు పేర్కొన్నారు.

**సంధి పూజకు 48 నిమిషాలు**

2026లో సంధి పూజకు అక్టోబర్ 19న ఉదయం 10:27 నుంచి 11:15 గంటల వరకు సమయం ఉంది. మొత్తం 48 నిమిషాల ఈ కాలంలో అష్టమి చివరి 24 నిమిషాలు, నవమి ప్రారంభమైన తొలి 24 నిమిషాలు ఉంటాయి. ఈ సమయాన్నే సంధి కాలంగా పరిగణించి పూజ నిర్వహిస్తారు. మత నమ్మకాల ప్రకారం ఈ సమయంలో దుర్గాదేవి చాముండి రూపంలో చండ, ముండ అనే రాక్షసులను సంహరించిందని చెబుతారు. అందుకే సంధి పూజలో చాముండి రూపంలో అమ్మవారిని ప్రత్యేకంగా ఆరాధిస్తారు.

# నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లతో ఎంబీబీఎస్ సీట్లు?

## తెలంగాణలో 37 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులపై అనుమానాలు.. 9 సీట్ల రద్దు



**హైదరాబాద్: తెలంగాణలో ఎస్టీ రిజర్వేషన్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ల కోసం నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసినట్లు అనుమానిస్తున్న 37 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారం వైద్య విద్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొందరు విద్యార్థులు తెలంగాణ ఎస్టీ రిజర్వేషన్ ప్రయోజనం పొందేందుకు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సర్టిఫికెట్ల జారీ వెనుక అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక దర్యాప్తు, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.**

### ఇప్పటికే 9 మందికి సీట్లు.. రద్దు దిశగా!

గుర్తించిన 37 మందిలో ఇప్పటికే 9 మందికి ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినట్లు సమాచారం. సర్టిఫికెట్ల పరిశీలనలో తేడాలు గుర్తించిన నేపథ్యంలో వారి అలాట్‌మెంట్లను రద్దు చేసే ప్రక్రియను విశ్వవిద్యాలయం చేపట్టినట్లు తెలుస్తోంది. 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల కుల, విద్యా, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నారు. రిజర్వేషన్ కేటగిరీకి సంబంధించిన పత్రాల్లో తేడాలు లేదా నకిలీ ధ్రువీకరణ పత్రాలు బయటపడితే అలాట్‌మెంట్ రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎస్టీ రిజర్వేషన్ సీట్లను అర్హులైన అభ్యర్థులకే కేటాయించాలనే ఉద్దేశంతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరాన్ని ఈ వ్యవహారం మరోసారి ముందుకు తెచ్చింది.



KALOJI NARAYANA RAO UNIVERSITY OF HEALTH SCIENCES
TELANGANA

MBBS/BDS ADMISSIONS UNDER COMPETENT AUTHORITY QUOTA FOR THE AY 2026-27

In continuation to the notice dated 03.09.2026 issued by the Kaloji Narayana Rao University of Health Sciences, Telangana, based on the communication received from the Director, Tribal Welfare, Telangana, Hyderabad, regarding the eligibility of candidates under the Scheduled Tribe (ST) category of Telangana State, it is hereby informed that the Director, Tribal Welfare, Telangana, Hyderabad, vide Rc.No.1298/TRI/TSV/2026, dated 22.09.2026, has furnished a further list of 37 candidates who are not eligible to claim the reservation benefits under Scheduled Tribe (ST) category of Telangana State for MBBS/BDS admissions. (Letter Attached)

Accordingly, the below mentioned 37 candidates shall not be considered under the ST category for admission to MBBS/BDS courses under Competent Authority Quota in Telangana State and shall henceforth be treated under the Open Category, subject to their eligibility and merit.

| S.NO | NEET UG ROLL NO | NEET RANK | NAME OF THE CANDIDATE | GENDER |
|---|---|---|---|---|
| 1 | 4201116082 | 187355 | BUKKE VISHRUTH | M |
| 2 | 4201307183 | 221669 | ERUKULA HEMADRI | M |
| 3 | 4208201362 | 252125 | KAKI NAGASHAYANA | F |
| 4 | 4201315115 | 357962 | N BHUVAN | M |
| 5 | 4221107173 | 504716 | MUDE VAKUL | M |
| 6 | 4201302107 | 648084 | PALAKEERTHI SUSHMA | F |
| 7 | 4201208118 | 1007993 | SUGALI VADTHE TANUSHRI | F |
| 8 | 4203104062 | 1059798 | PERAM SOHAN | M |
| 9 | 4201404134 | 81872 | NENAVATH KOVIDA | F |
| 10 | 4201310275 | 255430 | SANKARAPURAM RACHANA | F |
| 11 | 4201410324 | 379224 | NALABOTHULA CHAITRA | F |
| 12 | 4201413032 | 506547 | NINAVATH DINESH KUMAR NAIK | M |
| 13 | 4201109046 | 619260 | KOTLA NAGASRI YAGNA | F |
| 14 | 4219104184 | 492902 | G HARSHITHA | F |
| 15 | 4201404266 | 402844 | YERUKALA SUMALATHA | F |
| 16 | 4201202547 | 277709 | VADTHYA MANJULA | F |
| 17 | 4201304463 | 91648 | MALE SAI HARSHINI | F |
| 18 | 4201415014 | 176298 | DEVARASETTI NIHAL SIDDARTH | M |

## అక్టోబరులో 1.23 లక్షల టెక్ ఉద్యోగాలు

**ఢిల్లీ :** టెక్నాలజీ రంగంలో ఉద్యోగ అవకాశా లు మళ్లీ పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా అక్టోబరులో 1.23 లక్షల టెక్ ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చినట్లు 'ఎక్స్‌ఫెనో' సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలిపింది. గత 18 నెలల్లో ఇదే అత్యధికమని పేర్కొంది. సెప్టెంబరుతో పోలిస్తే 5 శాతం, గతేడాది అక్టోబరుతో పోలిస్తే 17 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. అయితే.. ఎక్కువ ఉద్యోగాలు అనుభవం ఉన్నవారికే లభిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది.

ఇందులో మధ్యస్థాయి నుంచి సీనియర్ లెవల్ ఉద్యోగాలు 68 వేల వరకు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. మొత్తం ఉద్యోగాల్లో ఇవి 55 శాతం కాగా.. ఫ్రెషర్లకు కేవలం 15 వేల కొలువులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు వెల్లడించింది. "ఉద్యోగ అవకాశాల కల్పనలో బెంగళూరు 31 వేల కొలువులతో ముందుంది. హైదరాబాద్‌లో 14 వేలు, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 9 వేల ఉద్యోగాలు ఉన్నాయి. చిన్న, మధ్యస్థ నగరాల్లో కలిపి 40 వేల అవకాశాలు ఉన్నాయి. ఈ ఉద్యోగాల్లో 81 శాతం కార్యాలయానికి వెళ్లి పనిచేసేవే. వర్క్ ఫ్రమ్ హోం అవకాశాలు తగ్గాయి" అని నివేదిక పేర్కొంది.

## ప్రజాధనం ఖర్చు చేస్తున్నా.. లెక్కలు సున్నా!

**ఢిల్లీ :** ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు విడుదలయ్యే నిధుల వినియోగాన్ని నిర్ధారించే యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సకాలంలో సమర్పించకపోవడం దేశ ఆర్థిక నిర్వహణలో కొనసాగుతున్న కీలక సమస్యగా లోగడ కాగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. నిధులు అందుకున్న రాష్ట్ర ప్రభుత్వాలు, శాఖలు, విధానాలు అమలు చేసే సంస్థలు వాటి వినియోగానికి సంబంధించిన ఆధారాలను సమయానికి సమర్పించకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. అయితే దీన్ని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం నిధులే లెక్కలేనివిగా మారాయనేలా అర్థం చేసుకోకూడదు.

కేంద్ర ఆర్థిక నిబంధనల ప్రకారం గ్రాంట్-ఇన్-ఎయిడ్ అందుకున్న సంస్థలు నిర్దేశిత కాలంలో యూసీలు సమర్పించాలి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కాగ్ నివేదికలు, యూసీలు అందని మేరకు ఖాతాల్లో చూపిన మొత్తాలు నిజంగా లబ్ధిదారులకు చేరాయా లేదా అన్నదానిపై ఆడిట్ రిస్క్ ఉంటుందని స్పష్టంగా పేర్కొంటున్నాయి.

రాష్ట్రాల పరిస్థితి సమస్య తీవ్రతను మరింత స్పష్టం చేస్తోంది. మధ్యప్రదేశ్‌లో 2024-25 ముగిసే నాటికి 27 రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు సంబంధించి 19,622 యూసీలు, రూ.17,808.28 కోట్ల విలువైన నిధులకు సంబంధించిన ధ్రువీకరణలు పెండింగ్‌లో ఉన్నాయని కాగ్ నమోదు చేసింది. ఒడిశాలోనూ 2023-24 వరకు 12,050 యూసీలకు సంబంధించి రూ.16,585.45 కోట్లు పెండింగ్‌లో ఉండగా వాటిలో 2003-04 నుంచి 2019-20 మధ్యకాలానికి చెందిన 6,363 యూసీలు ఉండటం వ్యవస్థాగత జాప్యాన్ని ఎత్తిచూపుతోంది. ఇక్కడే జవాబుదారీతనంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యూసీ లేకపోవడం నిధులు దుర్వినియోగ మయ్యాయని నిరూపణ కాదు. కానీ నిధులు నిర్దేశిత ప్రయోజనానికే ఖర్చయ్యాయా, ఖర్చు కాకుండా ఖాతాల్లోనే ఉన్నాయా లేదా ఇతర అవసరాలకు మళ్లాయా అన్నది ధ్రువీకరించే ఆడిట్ చెయిన్‌లో కీలకమైన ఆధారాలు మాత్రం కనుమరుగవుతున్నాయనేది వాస్తవం. ఇది ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

ఈ సమస్యను తగ్గించేందుకు కేంద్రం పీఎఫ్ఎంఎస్, సింగల్ నోడల్ ఏజెన్సీ(ఎస్ఎన్ఏ), ఎస్ఎన్ఏ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టింది. ఒక పథకానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు వచ్చినప్పుడు అవి వివిధ శాఖలు, బ్యాంకు ఖాతాలు, అమలు సంస్థల వద్ద అనేక చోట్ల మూలుగకుండా రాష్ట్రం గుర్తించిన ఒకే ప్రధాన ఖాతా/ఏజెన్సీ ద్వారా ఆ డబ్బును నిర్వహించేడమే ఎస్ఎన్ఏ విధానం. అయినప్పటికీ తాజా కాగ్ పరిశీలనల్లో కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఎన్ఏ ఖాతాల్లో భారీగా నిధులు ఖర్చుకాకుండా ఉండటం, కేంద్ర-రాష్ట్ర వాటాల బదిలీల్లో డేటా వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

యూసీలు ఆలస్యమైతే విడుదలైన నిధులు నిర్దేశిత ప్రయోజనానికే ఖర్చయ్యాయా లేదా అన్నది వెంటనే నిర్ధారించడం కష్టమవుతుంది. దీంతో ప్రభుత్వ ఖర్చుల నాణ్యతపై ఆడిట్ పర్యవేక్షణ బలహీనపడుతుంది. ఖర్చు వివరాలు అందుబాటులో లేకపోతే నిధులు ఖర్చుకాకుండా పడి ఉన్నాయా, ఇతర అవసరాలకు మళ్లాయా, లేక నిజంగా పథకానికే వినియోగించారా అన్నది నిర్ధారించడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఒక పథకానికి కేటాయించిన నిధుల వినియోగం స్పష్టంగా కనిపించకపోతే తదుపరి విడత నిధుల విడుదలలో పరిపాలనా, ఆడిట్ సమస్యలు తలెత్తవచ్చు. ఫలితంగా మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, స్థానిక సంస్థల అభివృద్ధి వంటి కార్యక్రమాల అమలు మందగించే అవకాశం ఉంటుంది. సరైన ఖర్చుల ధ్రువీకరణ లేకపోవడం వల్ల ప్రజాధనం ఎలా వినియోగించారో తెలియదు. అందుకే పీఎఫ్ఎంఎస్, ఎస్ఎన్ఏ వంటి డిజిటల్ నిధుల పర్యవేక్షణ వ్యవస్థలు కీలకం. వీటి ఉద్దేశం నిధుల విడుదల నుంచి తుది వినియోగం వరకు ఆర్థిక ప్రవాహాన్ని ట్రాక్ చేయడం. అయితే డిజిటల్ ట్రాకింగ్‌తో పాటు క్షేత్రస్థాయి లెక్కలు, ఆడిట్, యూసీలను కూడా సకాలంలో పూర్తి చేసేలా పటిష్ఠ యంత్రాంగం ఉండాలి. ప్రజాధనాన్ని పైసాతో సహా లెక్క తేల్చాలి.

## 'సర్' సేవలో అధ్యాపకులు

**ఢిల్లీ :** 'సర్' కారణంగా కర్ణాటకలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల చదువులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం కోసం పలువురు అధ్యాపకులను అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుగా నియమించడంతో చాలా కాలేజీల్లో తరగతులు సక్రమంగా జరగడం లేదు. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ సెమిస్టర్ల ముగింపు దశకు చేరుకున్నప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు.

బెంగళూరు నార్త్ యూనివర్సిటీ (బీఎన్‌యూ) పరిధిలోని కాలేజీల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం జూలై 20న ప్రారంభమైంది. అయితే సర్ విధులకు పంపిన చాలా మంది అధ్యాపకులు ఇప్పటికీ తిరిగి రాలేదని కాలేజీల ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఓ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మా కాలేజీ సిబ్బందిలో 50 శాతానికి పైగా సర్ పనికి వెళ్లారు. దీంతో మొత్తం విద్యా వ్యవస్థ దెబ్బతింది' అని బీఎన్‌యూ పరిధిలోని ఓ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ తెలిపారు. మరో కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ క్యాంపస్‌లో 3,000 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, అధ్యాపకులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది విద్యార్థులు తరగతులకు హాజరుకావడం లేదన్నారు.

అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీలతో తరగతులు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. అయితే వారు కూడా ఇటీవలే విధుల్లో చేరారని, కామర్స్, సైన్స్, ఇంగ్లిష్ వంటి కొన్ని విభాగాలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు అవసరమని ఓ ప్రిన్సిపాల్ చెప్పారు. బీఎన్‌యూ పరిధిలో ప్రస్తుత సెమిస్టర్‌కు నవంబర్ 7 చివరి పనిదినం కాగా, డాక్టర్ మన్మోహన్ సింగ్ బెంగళూరు సిటీ యూనివర్సిటీ పరిధిలో అక్టోబర్ 23 చివరి పనిదినంగా ఉంది.

కొన్ని కాలేజీల్లో మొత్తం సిబ్బందినీ సర్ విధులకు పంపినట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు. తమ కాలేజీలో స్పోర్ట్స్ ట్రైనర్, లైబ్రేరియన్లను కూడా ఈ పని నుంచి మినహాయించలేదని ఓ ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రతిరోజూ విద్యార్థులకు సమాధానం చెప్పాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపకులను ఎప్పుడు సర్ విధుల నుంచి రిలీవ్ చేస్తారని అధికారులను అడిగితే.. కాలేజీని మూసివేయాలని చెప్పారని మరో ప్రిన్సిపాల్ తెలిపారు.

కర్ణాటక ప్రభుత్వ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టిఎం మంజునాథ్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, అధ్యాపకులను సర్ విధుల నుంచి రిలీవ్ చేయాలని కోరారు. తరగతులు నిర్వహించకుండానే సెమిస్టర్ పూర్తి చేయడం విద్యార్థులకు తీవ్ర అన్యాయమని అన్నారు. కొన్ని జిల్లాల్లో కాలేజీల మొత్తం సిబ్బందినీ సర్ పనికి పంపారని, దీనివల్ల విద్యా నాణ్యత దెబ్బతింటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకు కూడా ఆసక్తి చూపకపోవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# దసరా సెలవులు.. వరుసగా 12 రోజులు!

» అక్టోబర్ 10 నుంచే సెలవుల సందడి.. ఏపీలో 21 వరకు » 22న పాఠశాలల పునఃప్రారంభం



**అమరావతి : విద్యార్థులకు దసరా పండగ ముందే వచ్చేసింది. పాఠశాలలకు వరుసగా సెలవులు రానున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 12 నుంచి 21 వరకు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. అయితే అక్టోబర్ 10 రెండో శనివారం, 11 ఆదివారం కావడంతో.. ఆ రెండు రోజులు కలుపుకుని విద్యార్థులకు వరుసగా 12 రోజుల పాటు సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.**

### ముందుగానే ప్రయాణ ప్రణాళికలు

దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ సందర్భంగా ప్రయాణాలు పెరిగే అవకాశం ఉండటంతో రైళ్లు, బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

### తెలంగాణలోనూ సుదీర్ఘ సెలవులు

తెలంగాణలోనూ విద్యార్థులకు దసరా సెలవులు సుదీర్ఘంగానే ఉండనున్నాయి. అక్టోబర్ 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. బతుకమ్మ, విజయదశమి వేడుకల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

### సెలవుల్లో ప్రత్యేక తరగతులకు నో

దసరా సెలవుల సమయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ స్పష్టం చేసింది. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సెలవుల్లో స్పెషల్ క్లాసులు నిర్వహించకుండా ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హన్మకొండ జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్ హెచ్చరించారు.

### పాఠశాలల వారీగా నిర్ధారించుకోవాలి

ప్రభుత్వం ప్రకటించిన సెలవుల తేదీలకు అనుగుణంగా పాఠశాలలు వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యా క్యాలెండర్ ప్రకారం మార్పులు చేసే అవకాశం ఉన్నందున.. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయా పాఠశాలల నుంచి సెలవులు, పునఃప్రారంభ తేదీలను ఒకసారి నిర్ధారించుకోవడం మంచిది.

# 'మెట్రో'లో అర్పణ్.. పాత దుస్తులకు కొత్త రూపం!



**న్యూఢిల్లీ:** పాత దుస్తులను పారవేయకుండా రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ చేయాలనే ఉద్దేశంతో ఢిల్లీ మెట్రో ప్రారంభించిన 'అర్పణ్ కేంద్రాలకు' విశేష స్పందన లభిస్తోంది. ఆగస్టులో ప్రారంభమైన ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 76,700 కిలోల పాత దుస్తులను సేకరించింది. 7,597 మంది దాతలు ఈ దుస్తులను అందించినట్లు అధికారులు తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 17 నాటికి ఢిల్లీలోని 10 అర్పణ్ కేంద్రాల్లో 76,700 కిలోల దుస్తులు సేకరించారు. మొత్తం 7,597 మంది తమ పాత దుస్తులను విరాళంగా ఇచ్చారు. ప్రయాణికులు మెట్రో స్టేషన్లలోనే తమకు అవసరం లేని దుస్తులను అందించవచ్చు. అక్కడి నుంచి వాటిని రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ కోసం పంపిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ), డీఎంఆర్‌సీ లేడీస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (డీఎల్‌డబ్ల్యూవో), ఢిల్లీ ప్రభుత్వ స్టేట్ అర్బన్ లైవ్లీహుడ్స్ మిషన్ (ఎస్‌యూఎల్ఎం), క్లాత్స్ బాక్స్ ఫౌండేషన్, రెస్పన్ సంస్థలు కలిసి నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందం జులై 14న ముఖ్యమంత్రి రేఖా గుప్తా సమక్షంలో కుదిరింది. మొదటి అర్పణ్ కేంద్రాన్ని ఆగస్టు 3న పంజాబీ బాగ్ వెస్ట్ మెట్రో స్టేషన్‌లో ప్రారంభించారు. అదే సమయంలో ఐదు కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన ఐదు కేంద్రాలను ఆగస్టు 17న ప్రారంభించారు. ప్రస్తుతం షాహదరా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆసుపత్రి, మయూర్ విహార్ ఫేజ్-1, పంజాబీ బాగ్ వెస్ట్, షాలిమార్ బాగ్, మోహన్ ఎస్టేట్, లజపత్ నగర్, మాలవీయ నగర్, హౌజ్ ఖాస్, ద్వారకలో ఇవి పనిచేస్తున్నాయి.

అర్పణ్ కేంద్రాలు కేవలం దుస్తుల సేకరణకే పరిమితం కాలేదు. స్వయం సహాయక సంఘాలతో అనుబంధం ఉన్న మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ఇవి ప్రదర్శన, విక్రయ కేంద్రాలుగానూ పనిచేస్తున్నాయి. ఎస్‌యూఎల్ఎం నెట్‌వర్క్‌లోని మహిళలు ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వారికి వస్త్రాల అప్‌సైక్లింగ్‌లో శిక్షణ ఇస్తూ ఆర్థికంగా స్వతంత్రంగా మారేందుకు సహకరిస్తున్నారు.

వస్త్రాల వినియోగ కాలాన్ని పెంచడం, విస్మరించిన దుస్తులు ల్యాండ్‌ఫిల్స్‌కు చేరకుండా చూడటం ద్వారా ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఉపయోగించిన వస్తువులను మరింత ప్రయోజనం ఉన్న ఉత్పత్తులుగా మార్చడాన్నే అప్‌సైక్లింగ్ అంటారు. దాతలు తమ విరాళాలను క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకునే సదుపాయాన్ని కూడా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. నమోదు పూర్తయిన వెంటనే వారికి డిజిటల్ ధ్రువీకరణ అందుతుంది. కరపత్రాలు, డిజిటల్ ప్రచారం, వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# ఢిల్లీ కాలుష్యం: ఆరేళ్ల తర్వాత మళ్లీ అధ్వాన్నం!

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ మరింతగా క్షీణిస్తోంది. వరుసగా ఐదో రోజు గాలి కాలుష్యం పెరగడంతో అక్టోబర్ ప్రారంభంలోనే 2020 తర్వాత అత్యంత అధ్వాన్నమైన పరిస్థితి నమోదైంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఢిల్లీ సగటు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 187గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీలో ఉన్నప్పటికీ, గత 82 రోజుల్లో ఇదే అత్యధిక స్థాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం.. శనివారం ఏక్యూఐ 171, శుక్రవారం 174, గురువారం 166గా నమోదైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు ఇది 197కు చేరింది. అనంతరం గాలి వేగం కొంత పెరగడంతో స్వల్పంగా తగ్గింది. ప్రధాన కాలుష్య కారకంగా పీఎం10 గుర్తించారు. రోడ్లపై ధూళి, నిర్మాణ పనులు, వ్యవసాయ వ్యర్థాల దహనం వంటి కారణాలతో పీఎం10 పెరుగుతుంది. ఇటీవల వర్షాలు, అధిక గాలుల కారణంగా కాలుష్య కారకాలు చెదిరిపోవడంతో ఐదు రోజుల పాటు గాలి నాణ్యత 'సంతృప్తికరంగా' ఉండగా.. వర్షాలు తగ్గిపోవడం, స్థానికంగా ఉద్గారాలు పెరగడంతో పరిస్థితి మళ్లీ దిగజారింది. 2026 అక్టోబర్ తొలి నాలుగు రోజుల్లో ఢిల్లీ సగటు ఏక్యూఐ 174.5గా నమోదైంది. 2025లో ఇదే కాలానికి 119.75, 2024లో 167.25, 2023లో 155, 2022లో 161.25, 2021లో 107.25, 2020లో 176.25గా నమోదైంది. అంటే 2026లో అక్టోబర్ ప్రారంభం గత ఆరేళ్లలో అత్యంత కాలుష్యంతో కూడిన ప్రారంభాల్లో ఒకటిగా నిలిచింది. సెప్టెంబర్ చివర్లో కురిసిన వర్షాలు కొంతకాలం గాలిలోని కాలుష్య కణాలను తగ్గించాయి. వర్షాలు తగ్గిన తర్వాత ఉష్ణోగ్రతలు పెరగడం, ఉపరితల గాలులు బలహీనపడటంతో ధూళి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కాలుష్య కారకాలు గాలిలోనే నిలిచిపోతున్నాయని నిపుణులు తెలిపారు. శీతాకాలం సమీపిస్తున్న కొద్దీ ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉంది. సాధారణంగా సెప్టెంబర్ మధ్య నుంచి గాలి నాణ్యత క్షీణించడం ప్రారంభమవుతుంది. పంట వ్యర్థాల దహనం, రవాణా, పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లు, బయోమాస్ దహనం తదితరాలు శీతాకాలంలో కాలుష్యానికి ప్రధాన కారణాలుగా ఉంటాయి. దీపావళి సమయంలో బాణసంచా కూడా పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉంది. దీర్ఘకాలికంగా కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, వ్యర్థాల నిర్వహణ, భారీ వాహన రవాణా వంటి రంగాలపై సమగ్ర చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**ఢిల్లీ :** 2026 ఏడాదికి గానూ నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారం నుంచి ప్రారంభమైంది. వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ వరించింది. ఆప్టోజెనెటిక్స్‌పై అధ్యయనాలకు గానూ కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. గతేడాది మెడిసిన్‌లో ముగ్గురిని నోబెల్ వరించింది. మానవ రోగ నిరోధక వ్యవస్థ పనితీరును మెరుగ్గా అర్థం చేసుకునేందుకు దోహదపడే కీలక విషయాలను వెలుగులోకి తీసుకొచ్చిన పరిశోధక త్రయం- మేరీ ఇ బ్రంకో, ఫ్రెడ్ రామ్స్‌డెల్, డాక్టర్ షిమోన్ సకగుచిలకు ఈ పురస్కారం దక్కింది. భౌతికశాస్త్రం,రసాయన శాస్త్రం, సాహిత్యంలో విశేష కృషి చేసిన వారి పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్‌పై ప్రకటన రానుంది.

# టీడీపీ-వైసీపీ ఓట్లే టార్గెట్‌నా?

- ఏపీలో కొత్త పార్టీల హడావుడి వెనుక అసలు వ్యూహమేంటి?
- జెండాలు కొత్తవి.. లక్ష్యం మాత్రం పాత ఓట్లేనా?
- ఏపీలో కొత్త పార్టీల పుట్టగొడుగులు! ఓట్లు చీల్చడమే లక్ష్యమా.. అధికార పీఠమే టార్గెటా?



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త పార్టీల సందడి ఒక్కసారిగా పెరిగింది. ఒకరి తర్వాత మరొకరు రాజకీయ వేదికలు ప్రకటిస్తున్నారు. కొత్త జెండా.. కొత్త సిద్ధాంతం.. ప్రజలకు కొత్త ప్రత్యామ్నాయం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. జడ శ్రవణ్‌కుమార్, రామచంద్ర యాదవ్, మాజీ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు ఇలా పలువురు నేతలు రాజకీయంగా తమదైన ముద్ర వేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాజాగా వైఎస్సార్‌సీపీకి దూరమైన విజయసాయిరెడ్డి సైతం తన రాజకీయ భవిష్యత్తుపై సంకేతాలు ఇవ్వడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. అయితే కొత్త పార్టీలు పెట్టడం వెనుక నిజంగా ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలన్న లక్ష్యమా? లేక ప్రధాన పార్టీల ఓట్లను చీల్చడమే అసలు వ్యూహమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడూ రెండు ప్రధాన రాజకీయ శక్తుల చుట్టూనే తిరుగుతున్నాయి. ఒకవైపు అధికార కూటమి.. మరోవైపు వైఎస్సార్‌సీపీ. ఈ రెండు ప్రధాన శక్తుల మధ్యే ఎన్నికల పోరు సాగుతున్న నేపథ్యంలో కొత్తగా ఏర్పడే పార్టీలు తమకు ప్రత్యేకమైన ఓటు బ్యాంకును నిర్మించుకోవడం అంత తేలికైన వ్యవహారం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బలమైన కేడర్, నియోజకవర్గాల వారీగా నాయకత్వం, ప్రతి బూత్‌లో కార్యకర్తల వ్యవస్థ లేకుండా కొత్త పార్టీలు ఎన్నికల రాజకీయాల్లో ఎంతవరకు ప్రభావం చూపగలవన్నది ప్రశ్నగా మారింది.

రాజకీయ పార్టీని ప్రకటించడం, జెండా ఆవిష్కరించడం, భారీ సభ నిర్వహించడం, మీడియా సమావేశాల్లో సంచలన వ్యాఖ్యలు చేయడం సులువే. కానీ ఎన్నికల సమయంలో ఓటరును పోలింగ్ కేంద్రానికి తీసుకురావడం అంత సులభం కాదు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కేడర్‌ను నిర్మించడానికి సంవత్సరాల సమయం పడుతుంది. ప్రతి నియోజకవర్గంలో స్థానికంగా బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలి. కార్యకర్తలను సమన్వయం చేయాలి. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భారీ ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి.ఇవన్నీ లేకుండా కేవలం సోషల్ మీడియా ప్రచారం, టీవీ చర్చలు, మీడియా ప్రకటనలతో రాజకీయంగా బలపడటం సాధ్యమా అన్నది కొత్త పార్టీలకు ఎదురవుతున్న ప్రధాన సవాలు.

ఇక కొత్త పార్టీల ప్రభావం ప్రధానంగా ఓట్ల చీలికపైనే ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హోరాహోరీ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో కొన్ని వందల లేదా కొన్ని వేల ఓట్లు కూడా గెలుపోటములను మార్చే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో కొత్త పార్టీకి వచ్చిన ఓట్లు దాని సొంత రాజకీయ బలానికి నిదర్శనం కాకపోయినా.. ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై మాత్రం గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో కొత్త పార్టీలను రాజకీయ వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి.

అయితే ఒక పార్టీకి ఓట్లు పడటం, ఆ పార్టీకి శాశ్వత ఓటు బ్యాంకు ఏర్పడటం రెండూ వేర్వేరు విషయాలు. ఒక ఎన్నికల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతతోనో, స్థానిక అభ్యర్థిపై అసంతృప్తితోనో లేదా ఇతర రాజకీయ సమీకరణాల కారణంగానో కొంతమంది ఓటర్లు కొత్త పార్టీ వైపు మళ్లవచ్చు. కానీ ఆ ఓట్లను ప్రతి ఎన్నికలోనూ నిలబెట్టుకోవాలంటే బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరం. అదే కొత్త పార్టీలకు అతిపెద్ద పరీక్షగా మారనుంది.

సామాజిక వర్గాల పేరుతో రాజకీయ పునాది నిర్మించాలన్న ప్రయత్నాలు కూడా ఏపీలో కొత్తేమీ కాదు. అయితే ఒక సామాజిక వర్గం మొత్తాన్ని ఒకే రాజకీయ పార్టీ వైపు మళ్లించడం అంత సులభం కాదు. ప్రతి సామాజిక వర్గంలోనూ రాజకీయ అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయి. స్థానిక సమస్యలు, అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పనితీరు, కుల సమీకరణాలు, పార్టీ నాయకత్వంపై ఉన్న అభిప్రాయం.. ఇలా అనేక అంశాలు ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే ఒక వర్గం ఓట్లను తమవైపు తిప్పుకుంటామని ప్రకటించడం వేరు.. ఆ ఓట్లను ఎన్నికల రోజున పోలింగ్ బూత్ వరకు తీసుకురావడం వేరు.

మాజీ ఉన్నతాధికారులు రాజకీయాల్లోకి రావడం కూడా ఇప్పుడు చర్చకు వస్తోంది. పరిపాలనా అనుభవం, ప్రభుత్వ వ్యవస్థపై అవగాహన వారికి బలంగా ఉండవచ్చు. అయితే ఆ అనుభవాన్ని రాజకీయ ఓట్లుగా మార్చడం మాత్రం అంత తేలికైన విషయం కాదు. అధికారిగా ఉన్నప్పుడు ప్రజలను కలవడం ఒకటైతే.. రాజకీయ నాయకుడిగా ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో, ప్రతి కార్యకర్తతో సంబంధం కొనసాగించడం మరో విషయం. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ క్షేత్రస్థాయిలో విశ్వసనీయత సంపాదించాల్సి ఉంటుంది.

ఏపీలో గత రాజకీయ పరిణామాలను పరిశీలించినా ఇదే విషయం స్పష్టమవుతుంది. ప్రజాదరణ ఉన్న నేతలు, సినీ గ్లామర్ ఉన్న నాయకులు, భారీ అభిమాన వర్గాలు ఉన్నప్పటికీ రాజకీయంగా బలమైన ఓటు బ్యాంకును నిర్మించుకోవడానికి సంవత్సరాల పాటు శ్రమించాల్సి వచ్చింది. అందువల్ల కొత్తగా రాజకీయ రంగంలోకి వచ్చిన నేతలు తక్కువ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతామని భావిస్తే అది ఎంతవరకు సాధ్యమన్నది ఎన్నికలే తేల్చనున్నాయి.

ఇక అసలు రాజకీయ లెక్క మాత్రం వేరుగా ఉంది. కొత్త పార్టీలు పెద్ద సంఖ్యలో ఓట్లు సాధించకపోయినా.. ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేయగలవు. కొన్ని చోట్ల మూడో పార్టీకి వచ్చిన ఓట్లు విజేత మార్జిన్ కంటే ఎక్కువగా ఉంటే.. ఆ పార్టీకి సీటు రాకపోయినా ఫలితాన్ని మార్చిన శక్తిగా నిలుస్తుంది. దీంతో కొత్త పార్టీలు 'ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులా?' లేక 'ఓటు కట్టర్లా?' అన్న చర్చ మొదలైంది.

ప్రస్తుతం ఏపీలో కొత్త పార్టీల హడావుడి చూస్తుంటే రాజకీయాల్లోకి ప్రవేశించడం సులభమైందన్న భావన కలుగుతోంది. కానీ ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోవడం మాత్రం అంత సులభం కాదు. జెండా ఎగరేయడానికి ఒక రోజు చాలు.. పార్టీని గ్రామస్థాయికి తీసుకెళ్లడానికి సంవత్సరాలు కావాలి. ప్రెస్‌మీట్‌తో రాజకీయ ప్రకటన చేయొచ్చు.. కానీ ఓటరు మనసులో స్థానం సంపాదించుకోవడానికి నిరంతర ప్రజా పోరాటం అవసరం.

అందుకే రానున్న రోజుల్లో కొత్త రాజకీయ వేదికలకు అసలు పరీక్ష మొదలుకానుంది. టీడీపీ-వైసీపీ ఓటు బ్యాంకుల్లో ఎంత మేరకు చీలిక తీసుకురాగలరు? జనసేన ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ఎంతవరకు నిలబడగలరు? సొంతంగా ఎంత శాతం ఓట్లు సాధించగలరు? ఎన్ని నియోజకవర్గాల్లో తమ ఉనికిని చాటగలరు? అన్నది తేలాల్సి ఉంది.

రాజకీయాల్లో జెండాలు ఎన్నైనా ఎగరవచ్చు. నేతలు ఎందరో ప్రకటనలు చేయవచ్చు. కానీ చివరికి ప్రజాస్వామ్యంలో అసలు తీర్పు ఇచ్చేది ఓటరే. కొత్త పార్టీలకు ప్రజలు ప్రత్యామ్నాయంగా పట్టం కడతారా.. లేక ప్రధాన పార్టీల మధ్య ఓట్లను చీల్చే శక్తిగానే పరిమితం చేస్తారా అన్నది రాబోయే ఎన్నికలే తేల్చనున్నాయి.

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో ఇండియా నెంబర్1



**అమరావతి :** డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో ఇండియా నంబర్ 1గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదని చెప్పారు. రోడ్ గ్రిడ్ విషయంలో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా దీల్లీలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు.

"1895లో సీఐఐ కోల్‌కతాలో ఏర్పాటైంది. 1996 ప్రాంతంలో నేను సీఐఐని ప్రమోట్ చేశాను. 1990లో వచ్చిన ఐటీ విప్లవాన్ని నేను అందిపుచ్చుకున్నా. ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. పెట్టుబడిదారులు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే. రియల్ టైమ్‌లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఏపీలో డిజిటల్ హబ్, డేటా సెంటర్లు వస్తున్నాయి. ఇటీవలే రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రారంభించాం.

రాష్ట్రంలో సముద్ర తీరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రతి 50 కి.మీ.కు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. పోర్టుల అనుసంధానానికి, కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. పుట్టపర్తిలో డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. అతిపెద్ద రక్షణ తయారీ కేంద్రానికి రాష్ట్రంలో అడుగులు పడ్డాయి. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో రాష్ట్రం నుంచి ఎగుమతులకు చర్యలు చేపట్టాం. పరిపాలనలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు జోడించి సేవలు వేగవంతం చేశాం. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీతో సేవల వేగవంతానికి చర్యలు చేపట్టాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ప్రారంభానికి చర్యలు ప్రారంభించాం. అమరావతిని గ్లోబల్ టెక్ కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.

# 'డ్రాగన్' రిలీజ్‌పై మళ్లీ సందేహాలు?




యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేతికి అయిన గాయం, ఆ తర్వాత జరిగిన ఆపరేషన్ ప్రస్తుతం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా అభిమానులకు దూరంగా ఉన్న ఎన్టీఆర్ తాజాగా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమా కార్యక్రమానికి హాజరై అభిమానులు, మీడియా ముందుకు వచ్చారు. అయితే ఈ సందర్భంగా ఆయన కుడిచేతిని ఉపయోగించిన తీరు అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో ఎన్టీఆర్ ఇంకా గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదా అనే చర్చ మొదలైంది. చాలా రోజుల తర్వాత ఎన్టీఆర్ ఫహద్ ఫాజిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఎక్కువగా ఎడమ చేతినే ఉపయోగించడం కనిపించింది. సాధారణంగా అభిమానులను పలకరించేటప్పుడు, అభివాదం చేసేటప్పుడు కుడిచేతిని ఎక్కువగా ఉపయోగించే ఆయన.. ఈసారి ఎడమ చేతితోనే అభివాదం చేశారు. అంతేకాదు, మైక్‌ను కూడా ఎడమ చేతితో పట్టుకుని మాట్లాడారు. కుడిచేతిని పైకి ఎత్తకుండా, దాన్ని పెద్దగా కదిలించకుండా జాగ్రత్తగా ఉంచడం కూడా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో పలువురితో మాట్లాడినప్పటికీ కుడిచేతితో షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా ఉండటం కనిపించింది. దీంతో ఆయన గాయం ఇంకా పూర్తిగా తగ్గలేదేమోనని అభిమానులు సోషల్ మీడియాలో చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా.. ఓ అభిమానిని ఎన్టీఆర్ కలిసిన వీడియో తాజాగా బయటకు వచ్చింది. అందులో ఆయన కుడిచేతికి సపోర్ట్ బెల్ట్ తరహా పౌచ్ ధరించి కనిపించారు. ఈ దృశ్యాలు చూసిన అభిమాను లు ఎన్టీఆర్ ఇంకా రికవరీ దశలోనే ఉన్నారని భావిస్తున్నారు. అయితే ఆయన గాయం పూర్తిగా ఎంతవరకు తగ్గిందనే విషయంపై ఎన్టీఆర్ నుంచి కానీ, చిత్రబృందం నుంచి కానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కేవలం ఆయన కనిపించిన తీరు ఆధారంగానే అభిమానులు ఈ విషయంపై చర్చించుకుంటున్నారు.

ఎన్టీఆర్ గాయం కారణంగా 'డ్రాగన్' సినిమా షూటింగ్ ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత మైత్రి రవిశంకర్ కీలక ప్రకటన చేశారు. 2027 జూన్ 11న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ఆయన వెల్లడించారు. మిగిలిన షూటింగ్‌ను అక్టోబర్ రెండో వారం నుంచి తిరిగి ప్రారంభించే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే సినిమాలో ఇంకా కీలకమైన సన్నివేశాలతో పాటు యాక్షన్ ఎపిసోడ్స్ కూడా చిత్రీకరించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మాతలు చెప్పిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ తిరిగి ప్రారంభమై, మిగిలిన పనులు సకాలంలో పూర్తయితే 2027 జూన్ 11న 'డ్రాగన్' విడుదలకు మార్గం సుగమం అవుతుంది. కానీ ఎన్టీఆర్ పూర్తి స్థాయిలో షూటింగ్‌కు తిరిగి ఎప్పుడు వస్తారనేది కూడా కీలకంగా మారింది. ముఖ్యంగా భారీ యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున.. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాతే షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుతం ప్రకటించిన విడుదల తేదీకి సినిమా వస్తుందా లేదా అనేది రానున్న రోజులలో తెలియనుంది.

## మనం మరచిన చరిత్ర

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో 'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ట్రూత్' పేరుతో రూపొందించిన నాలుగు ఎపిసోడ్ల డాక్యుమెంటరీ సిరీస్‌లో రెండో ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్‌గాట్' బుధవారం యూట్యూబ్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇందులో బ్రిటీషర్స్ ఉద్దేశ్యపూర్వకంగా దాచిన నిజాలు ఏమిటి? రైల్వేల పేరుతో మన దేశపు ధాన్యసిరులను బ్రిటీషర్స్ ఎలా తరలించుకుపోయారో ఈ రెండో ఎపిసోడ్‌లో చూపించారు. ఈ సందర్భంగా విజయ్ దేవర కొండ మాట్లాడుతూ 'అప్పట్లో మనకు చరిత్ర అంటే



బ్రిటీషర్స్ చెప్పిందే. మనవాళ్ల శ్రమతో బ్రిటీషర్లు వాళ్ల స్వార్థం కోసం నిర్మించుకున్నదే ఇండియన్ రైల్వేస్ అని తెలుసుకున్నా. ట్రిలియన్ డాలర్స్ విలువైన ధాన్యం, పత్తి, మసాలా దినుసులు, బంగారాన్ని ఇండియన్ రైల్వేస్ ద్వారా బ్రిటీషర్స్ తరలించారు' అని అన్నారు. అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్‌గాట్' స్ట్రీమింగ్‌కు రాబోతున్నది.



ఎరుపు చీరలో స్రవంతి చొక్కారపు మరోసారి ప్రత్యేకంగా కనిపించింది. బిందీ, ఎరుపు గాజులు, గోల్డ్ జ్యువెలరీకి తోడు ఆమె హెయిర్‌స్టైల్, విభిన్న పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా వెనక్కి తిరిగి కెమెరా వైపు నవ్వుతూ ఇచ్చిన పోజు ఈ ఫొటోషూట్‌లో హైలైట్‌గా కనిపిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.